TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

శనివారం, అక్టోబర్ 10, 2026 | సంపుటి - 21 | సంచిక 02 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

తెలంగాణలో 95 లక్షల
ఓట్ల తొలగింపు వార్త అవాస్తవం



తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి

హైదరాబాద్ : తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగింపు వార్త అవాస్తవమని ఎస్ఈసీ తెలిపారు. 95 లక్షల ఓట్లను తొలగించారంటూ వచ్చిన వార్తపై తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రచారం జరుగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 73,39,235 మంది ఓటర్లను మాత్రమే ఏఎస్‌డీడీ కేటగిరీలో గుర్తించినట్లు వెల్లడించారు. 2లో

స్థానిక ఎన్నికలపై
ఎస్ఈసీ కీలక ప్రకటన

ప్రభుత్వం గెజిట్ ఇస్తేనే ఎన్నికల నోటిఫికేషన్



అమరావతి : ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే, ఆ తర్వాత ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 'సర్' ప్రక్రియ తర్వాత చేపట్టిన ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. తరువాయి 2లో

బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం

శనివారం అత్యవసర క్యాబినెట్ భేటీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. బీసీలకు తగిన న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశంపై ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగ పరిధిలో బీసీలకు సాధ్యమైనంత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగబద్ధమైన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ అంశంపై చర్చించి తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు శనివారం అత్యవసర క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ ఏకసభ్య కమిషన్ నివేదికను క్యాబినెట్ ముందు ఉంచనున్నట్లు తెలిపారు. తరువాయి 2లో

ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్
యాక్షన్ ప్లాన్

12న మంత్రులతో కీలక భేటీ

హైదరాబాద్ : ఎల్‌నినో పరిస్థితులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సీఎం అక్టోబర్ 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 2లో

ఉక్రెయిన్‌లో మృతి చెందిన
తెలంగాణవాసి

మృతదేహం తరలింపునకు మంత్రి అడ్లూరి భరోసా

ప్రవాసి ప్రజావాణిలో బాధిత కుటుంబం వేడుకోలు..

సీఎంఓ అధికారులతో మాట్లాడి సహాయం అందిస్తామని హామీ

హైదరాబాద్ : విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రవాస భారతీయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందిస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఉక్రెయిన్‌లో మృతి చెందిన జగిత్యాల జిల్లా వాసి వావిలాల సుదర్శన్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యం శుక్రవారం ప్రవాసి ప్రజావాణిని సందర్శించి, సీఎం ప్రజావాణి కార్యక్రమం అమలవుతున్న తీరును పరిశీలించారు. 2లో

నోయిడాలోని జెవార్ ఎయిర్‌పోర్టుకు నరేంద్రమోదీ పేరు

ప్రకటించిన యూపీ సీఎం యోగి

ఉత్తర ప్రదేశ్, నోయిడాలోని జెవార్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రధాని నరేంద్ర మోదీ పేరు పెట్టను న్నారు. ఈ విషయాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. యూపీ రాజధాని లక్నోలో శుక్రవారం ఉన్నతస్థాయి క్యాబినెట్ సమావేశం జరిగింది.

సీజేపీ నిరసన కోసం అన్నింటినీ
బంద్ చేయొద్దు

కేంద్రానికి సూచించిన సుప్రీంకోర్టు

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో అక్టోబర్ 10, శనివారం ఆందోళన చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా జంతర్ మంతర్ సమీపంలోని పలు మెట్రో స్టేషన్లను, రైలు సర్వీసులను ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు స్పందించింది. నిరసన ఉన్నంతమాత్రాన రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు మూసివేయడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ విషయాన్ని పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఢిల్లీలో 57 మెట్రో స్టేషన్లు, ఇతర స్థానిక రైల్వే స్టేషన్లను 2లో

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు
నెల రోజుల్లో పరిష్కారం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ : 22ఎ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ఏడు కీలక ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. తాజాగా జీఓ 59 దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందన్నారు. 500 చదరపు గజాలలోపు జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇస్తూ.. మెమో నెం.48030 జారీ చేసినట్లు తెలిపారు. జీఓ 59 అమలులో అక్రమాలకు తావులేదని.. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. గతంలో జీఓ 59 అమలులో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. 22-ఎపై శరవేగంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. 22-ఎకు సంబంధించిన 10-12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. తరువాయి 2లో

ఉత్తర ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

8 సీట్లు గెలిచిన బీజేపీ.. ఎస్పీకి 2 సీట్లు

ఉత్తర ప్రదేశ్ రాజ్యసభ స్థానాల అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 10 రాజ్యసభ స్థానాలకుగాను.. 8 సీట్లు బీజేపీకి, 2 సీట్లు ఎస్పీకి దక్కాయి. 10 సీట్లు ఉన్న చోట 10 మంది మాత్రమే బరిలో నిలవడంతో పోటీ అవసరం లేకుండా పోయింది. మెజారిటీకి అనుగుణంగా ఎనిమిది మంది అభ్యర్థులు బీజేపీ తరఫున, ఇద్దరు సమాజ్‌వాదీ పార్టీ తరఫున బరిలో నిలిచారు. పోటీ లేకపోవడంతో పది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉత్తర ప్రదేశ్‌లో 10 రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటికిగాను అక్టోబర్ 16న ఎన్నిక జరగాలి. కానీ, ఎన్నిక లేకుండానే నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యసభ అభ్యర్థులు బీజేపీ, ఎస్పీ తరఫున ఇప్పటికే నామినేష్ వేశారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు నేడు పూర్తైంది. నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం మొత్తం 10 మంది బరిలో నిలిచారు. దీంతో అందరూ ఏకగ్రీవంగా గెలిచినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. తరువాయి 2లో

తెలంగాణలో 95 లక్షల ఓట్ల తొలగింపు వార్త అవాస్తవం

ఇప్పటివరకు 92,88,187 నోటీసులు జారీ చేశామని చెప్పారు. 92,23,486 మంది ఓటర్లకు నోటీసులు అందగా.. ఇంకా 64,701 నోటీసులను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు నోటీసులు అందుకున్న వారిని 82,11,205 మంది విచారణలు పూర్తి అయినట్లు ఎస్ఈసీ తెలిపారు. తుది ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు 74,62,851 మందిని అర్హులుగా గుర్తించామని.. అనర్హులుగా గుర్తించిన ఓటర్లు 12,969 మంది మాత్రమే అని తెలిపారు. మరో 18,12,367 మంది ఓటర్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. 2026, నవంబర్ 5 లోపు మిగిలిన నోటీసులపై నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన వార్త వాస్తవాలకు దూరంగా ఉందన్న తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ యాక్షన్ ప్లాన్

తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉంది.

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం

జీఓ118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. 22-ఎలో ఉన్నా మున్సిపల్ అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తామని మంత్రి తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం

కమిషన్ నివేదిక, సుప్రీంకోర్టు తీర్పు, రాజ్యాంగ నిబంధనలను సమగ్రంగా పరిశీలించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీల రాజకీయ సాధికారతకు చట్టబద్ధమైన, నిలకడైన పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు చెప్పారు. చట్టపరంగా సమస్యలు ఉన్నప్పటికీ, రాజకీయంగా బీసీలకు 34 శాతం కంటే ఎక్కువ సీట్లు ఇచ్చి న్యాయం చేస్తామని ఇప్పటికే ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణలోకి అకున్ సబర్వాల్

హైదరాబాద్ : సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ తిరిగి తెలంగాణ క్యాడర్‌లోకి రానున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర పోలీసు, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కేంద్ర డిప్యుటేషన్ పూర్తి చేసుకున్న ఆయనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో.. గతంలో ఆయన చేపట్టిన సంచలనాత్మక టాలీవుడ్ డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2017లో హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ రాకెట్ దర్యాప్తులో అప్పటి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న అకున్ సబర్వాల్ కీలక పాత్ర పోషించారు. ఆయన నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం పలువురు సినీ ప్రముఖులను విచారించింది.అప్పట్లో ఎల్ఎస్‌డీ,ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాల సరఫరా వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. డ్రగ్ పెడ్లర్ల అరెస్టుల అనంతరం వారి కాంటాక్ట్ లిస్టుల్లో సినీ ప్రముఖుల ఫోన్ నంబర్లు ఉన్నాయన్న అంశం ఆధారంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారించారు. అయితే కేవలం ఫోన్ నంబర్లు ఉండటం, పరిచయం ఉండటం మాత్రమే నేరానికి ఆధారం కాదని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేశాయి. అప్పట్లో సినీ పరిశ్రమను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్న విమర్శలను సబర్వాల్ కూడా ఖండించారు.తదుపరి దశలో ఈ కేసుల దర్యాప్తు తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయి. 2024లో ఈ వ్యవహారానికి సంబంధించిన ఆరు కేసులను తగిన ఆధారాలు లేవన్న కారణంతో కోర్టు కొట్టివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. దర్యాప్తులో అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని, కొన్ని కేసుల్లో సరైన సాక్ష్యాలు లేవని కోర్టు పేర్కొన్నాయి.ఇక అంతకు ముందే అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన తిరిగి తెలంగాణకు రావడం సహజంగానే పాత కేసుపై ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన రాకతో డ్రగ్స్ కేసును ప్రభుత్వం తిరిగి తెరుస్తుందనే ప్రచారం జరుగుతోంది. దాంతో పాటు ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇస్తారన్నది కూడా చర్చనియాంశంగా మారింది. రేవంత్ సర్కార్ డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతుండగా.. తిరిగి అదే బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది.ఒకవేళ ఆయనకు ఆ బాధ్యతలనే అప్పగిస్తే.. అప్పటి దర్యాప్తులో నమోదైన అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సమీక్షిస్తుందా ? దర్యాప్తులో ప్రస్తావనకు వచ్చిన పేర్లపై మరింత లోతైన విచారణకు అవకాశం ఉంటుందా ? అప్పట్లో రాజకీయ, సినీ వర్గాల్లో చర్చకు వచ్చిన ఇతర పేర్లు ఏమైనా అధికారిక దర్యాప్తు రికార్డుల్లో ఉన్నాయా ? ఉంటే వాటి వివరాలు ప్రజలకు వెల్లడవుతాయా ? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తంగా అకున్ సబర్వాల్ రీఎంట్రీతో పాత డ్రగ్స్ కేసు రాజకీయ రంగు పులుముకుంటుందా, లేక ఇది కేవలం ఒక సీనియర్ అధికారి క్యాడర్ రిటర్న్‌గానే మిగిలిపోతుందా అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. ఆయనకు లభించే పోస్టింగ్, ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చే అవకాశం ఉంది.ఇక అకున్ సబర్వాల్ సతీమణి సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ వ్యక్తిగత కారణాలతో లాంగ్ లీవ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలిచిన మంత్రి కొల్లు

మచిలీపట్నం: మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్థాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదని కలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

సీజేపీ నిరసన కోసం అన్నింటినీ బంద్ చేయొద్దు

ప్రభుత్వం మూసివేయనుంది. శుక్రవారం రాత్రి 9.00 గంటల నుంచే వీటిని మూసివేయనున్నారు. అక్టోబర్ 10, శనివారం కూడా పూర్తిగా మూసి ఉంటాయి. ఎటువంటి ఆందోళన, హింస తలెత్తకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ నిర్ణయం వల్ల లక్షలాది ప్రజలు ఇబ్బందులు పడతారని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఆందోళన కార్యక్రమాలు ఉన్నంతమాత్రాన అన్ని మెట్రో స్టేషన్లను మూసివేసి, రైల్వే సేవలు నిలిపివేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. ఇలా మూసివేయడం వల్ల గురుగ్రామ్, ఈస్ట్ ఢిల్లీ, సౌత్ ఢిల్లీ సహా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది. ప్రజా రవాణా వ్యవస్థను మొత్తం నిలిపివేయకూడదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఇదే సమయంలో పౌరుల భద్రత విషయంలో రాజీ పడకూడదని సూచించింది. దీనిపై ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. ఈ విషయంపై ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. ఇదే సమయంలో నిరసనలకు వేదికవుతున్న జంతర్ మంతర్ అంశంపై కోర్టు స్పందించింది. ఇందుకోసం ప్రత్యామ్నాయ వేదికల్ని సిద్ధం చేయొచ్చు కదా అని సూచించింది. జంతర్ మంతర్ ప్రదేశం చాలా చిన్నగా ఉందని, ఇది ఉన్న ప్రదేశం కూడా ఇతర ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉందని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అంతేకాదు.. నిరసనకారులు ఆహారం తీసుకునేందుకు, శానిటేషన్‌కు, అంబులెన్సులు రావడానికి ఇబ్బందిగా ఉందని కోర్టు తెలిపింది. ధర్నాలు, నిరసనల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించింది.

నోయిడాలోని జెవార్ ఎయిర్‌పోర్టుకు నరేంద్రమోదీ పేరు

ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టుకు ప్రధాని మోదీ పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్ సీఎంగా, ప్రధానిగా మోదీ ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మోదీ గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం యోగి చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా సేవలో వరుసగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి యోగి శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో ఇండియా ప్రపంచవ్యాప్తంగా కొత్త గుర్తింపును పొందిందన్నారు. అలాగే, మానవతా విలువల్ని కాపాడారని ప్రశంసించారు. ఇదే సమయంలో మోదీ నాయకత్వంలో యూపీ వారసత్వపరంగా, అభివృద్ధి పరంగా కొత్త శకంలోకి అడుగుపెట్టిందన్నారు. మోదీకి, ఉత్తర ప్రదేశ్‌కు ఉన్న అనుబంధం ప్రత్యేకమైందని గుర్తు చేశారు. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య టీమిండియా స్పిరిట్ నడుస్తోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో సమన్వయంతో పని చేస్తుందన్నారు. యూపీ మంత్రుల బృందం ప్రధానికి ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని వివరించారు. 2017లో యూపీలో బీజేపీ అధికారంలోకి రాకముందు పరిపాలనలో అసమర్థత కనిపించేదన్నారు. రాష్ట్రంఓ కనీస వసతులు కూడా ఉండేవి కావని గుర్తు చేశారు. కానీ, మోదీ ప్రభుత్వ పాలన, పనితీరును స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ ప్రభుత్వ పాలనను అమలు చేస్తున్నట్లు యోగి చెప్పారు.

సీట్ల సర్దుబాటు ఎలా

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు-పవన్‌ల భేటీలు, పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాత జనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో జనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి-ఫామ్ రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగా మార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములను శాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీ ఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది. పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు-పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయ శ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

54 మందికి ఒకే ఇల్లు అమ్మకం

భాగ్యనగరంలో బడా మోసగాళ్లు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.సుమతి హెచ్చరించారు.మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తపు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలె రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్‌పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టిజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భారతీయులకు ట్రంప్ మరో షాక్...

హైదరాబాద్ : అమెరికాలో పనిచేస్తున్న విదేశీ టెక్ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మంజూరు ప్రక్రియలో కీలకమైన పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి ప్రపంచ ప్రఖ్యాత ఐటీ అవుట్‌సోర్సింగ్ దిగ్గజాలను సస్పెండ్ చేస్తూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు చేపట్టింది. జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు ప్రముఖ టెక్ సంస్థలు మైక్రోసాఫ్ట్, అడోబ్ కూడా ఉన్నాయని అమెరికా కార్మిక శాఖ స్పష్టం చేసింది. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ సమక్షంలో వైట్‌హౌస్ వేదికగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇకపై ఈ కంపెనీల నుంచి ఎలాంటి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించబోమని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామని వెల్లడించారు.పెర్మ్ ప్రక్రియ అంటే.. అమెరికాలో ఒక కంపెనీ విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డ్ ఇ-2, ఇ-3 కేటగిరీలు స్పాన్సర్ చేయాలంటే, మొదటగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్ పొందడం తప్పనిసరి చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగం చేసేందుకు స్థానికంగా అర్హులైన అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని, విదేశీయుడిని తీసుకోవడం వల్ల అమెరికన్ వర్కర్ల వేతనాలపై ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించాల్సి ఉంటుంది. కార్మిక శాఖ ఈ సర్టిఫికేట్‌ను ఆమోదించిన తర్వాతే కంపెనీలు యూఎస్‌సీఐఎస్ వద్ద ఐ-140 పిటిషన్ దాఖలు చేయగలవు. ఇప్పుడు ఈ ప్రధాన మార్గాన్నే నిలిపివేయడంతో, ఈ కంపెనీలు తమ విదేశీ ఉద్యోగుల తరఫున కొత్తగా గ్రీన్ కార్డ్ ప్రక్రియను ప్రారంభించే అర్హతను తాత్కాలికంగా కోల్పోయినట్లయింది.అమెరికా అధికార యంత్రాంగం ఈ కఠిన చర్యకు దిగడానికి హెచ్-1బీ , పెర్మ్ నిబంధనల దుర్వినియోగమే ప్రధాన కారణమని స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఈ దిగ్గజ ఔట్‌సోర్సింగ్ సంస్థలు దాదాపు 30 లక్షల మంది విదేశీ నిపుణుల కోసం దరఖాస్తులు చేశాయని, 2.3 లక్షలకు పైగా హెచ్-1బీ అప్రూవల్స్, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు పొందాయని యూఎస్ కార్మిక శాఖ పేర్కొంది. అమెరికన్ వర్కర్లకు సమాన అవకాశాలు కల్పించకుండా స్థానిక ఉద్యోగాలను కొల్లగొట్టేలా లేబర్ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించారని, ఫెడరల్ దర్యాప్తులు ఎదుర్కొంటున్నందున ఈ సస్పెన్షన్ వేటు వేశామని వివరించింది. తాజా చర్యలు అమెరికన్ నిరుద్యోగుల హక్కులను కాపాడేందుకేనని ప్రభుత్వం సమర్థించుకుంది.ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ ఐటీ నిపుణులకు, గ్రీన్ కార్డ్ ఆశావహులకు తీరని ఎదురుదెబ్బగా పరిణమించనుంది. ఈ సంస్థల్లో పనిచేస్తూ ఇప్పటికే పెర్మ్ అనుమతుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయ టెక్కీల భవిష్యత్తు ఒక్కసారిగా అనిశ్చితిలో పడింది. కొత్తగా దరఖాస్తులు ఆగిపోవడంతో పాటు, పెండింగ్ ఫైల్స్ కూడా నిలిచిపోవడం వల్ల గ్రీన్ కార్డ్ ప్రాసెసింగ్ మరింత తీవ్ర జాప్యానికి గురవుతుంది. ఇది భారత ఐటీ కంపెనీల వ్యాపార కార్యకలాపాలు, ఆన్-సైట్ డిప్లాయ్‌మెంట్ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా అధికారులు ఈ కంపెనీల అంతర్గత విధానాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, సస్పెన్షన్‌ను ఎత్తివేసే వరకు ఈ సంస్థల్లోని ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ మొదటి అడుగు పడటం అసాధ్యంగా మారనుంది.

ఉక్రెయిన్‌లో మృతి చెందిన తెలంగాణవాసి

ఈ సందర్భంగా జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ ఉక్రెయిన్‌లో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మృతి చెందిన విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సుదర్శన్ మృతి చెంది 39 రోజులు గడిచినా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహం తరలింపునకు రూ.6 లక్షలు చెల్లించాలని ఉక్రెయిన్ ఎంబసీ సూచించిన నేపథ్యంలో, ఆర్థికంగా భారాన్ని భరించలేని పరిస్థితిలో ప్రభుత్వ సహాయం కోసం వారు ప్రవాసి ప్రజావాణిని ఆశ్రయించారు. మృతుని భార్య భార్గవి, తల్లి గంగు, గ్రామ సర్పంచ్ బత్తుల గంగాధర్ కలిసి తమ సమస్యను అధికారులకు వివరించారు. స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సీఎంఓ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి కె. విద్యాసాగర్, ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, స్వదేశ్ పరికిపండ్ల తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ కీలక ప్రకటన

ప్రస్తుత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు ఖరారైతే రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఆ తర్వాతే స్థానిక నోటిఫికేషన్ ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనల ఆధారంగా ఈ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉంటామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. కాగా, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సర్ ప్రక్రియ తరువాతే స్థానిక ఎన్నికలు జరపాలనే వైసీపీ వాదనను తోసిపుచ్చింది. ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజాప్రయోజనాలను అడ్డుకోవడమేనని పేర్కొంది. ఈ విషయమై వైసీపీ వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది.

ఉత్తర ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

ఈ విజయంతో పెద్దల సభలో ఎస్పీ సభ్యుల సంఖ్య ఐదుకు చేరింది. ఇంతకుముందు రాజ్యసభలో ఎస్పీకి నలుగురు సభ్యులు (రాంగోపాల్ యాదవ్, జావేద్ అలీ, రాంజీ లాల్ సుమన్, జయా బచ్చన్) ఉండేవారు. ఇప్పుడు గెలిచిన రెండింట్లో ఒకటి గోపాల్ యాదవ్. అంటే, ఆయన పదవీకాలం పూర్తి కానుండగా.. మరోసారి ఆయనే గెలిచారు. ఇక, కొత్తగా ఎన్నికైంది ధన్‌రాజ్ నత్వాని. ఆయన చేరికతో ఎస్పీ రాజ్యసభ సభ్యుల సంఖ్య ఐదుకు చేరింది. ఇక, యూపీ నుంచి ఇప్పుడు బీజేపీ తరఫున ధర్మపాల్ సింగ్, ప్రకాష్ పాల్, శ్రుతి గంగ్వార్, విద్యా సాగర్ సోంకార్, ప్రియాంకా రావత్, రాధాకాంత్ ఓజా, గోపి కృష్ణ పాండే, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్ గెలిచారు.

హుస్సేన్ సాగర్ టూ ప్రకాశం బ్యారేజ్ సీప్లేన్

హైదరాబాద్, అక్టోబరు 9 : హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నీటిపై విమానం వేగంగా దూసుకెళ్లి ఆకాశంలోకి ఎగరడం, క్షణాల్లో కృష్ణా తీరానికి చేరుకుని విజయవాడ ప్రకాశం బ్యారేజీ జలాల్లో ల్యాండ్ అవ్వడం.. వినడానికే ఎంతో అద్భుతంగా అనిపించే ఈ ఊహ త్వరలోనే నిజరూపం దాల్చేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్-విజయవాడ నగరాల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శంషాబాద్-గన్నవరం విమాన సర్వీసులపై ఆధారపడుతున్నారు. అయితే, సాధారణ రవాణా వ్యవస్థకు పూర్తి భిన్నంగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే అత్యాధునిక సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ సర్వీసులు ప్రారంభమైతే ప్రయాణ సమయం ఆదా కావడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగానికి ఊహించని సరికొత్త ఊపు లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సాహసోపేత, జల పర్యాటకాన్ని ఇష్టపడే దేశ, విదేశీ పర్యాటకులకు ఇదొక అద్భుతమైన అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తూ, నూతన పర్యాటక పాలసీని రూపొందించి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రితో భేటీ అయినప్పుడు హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీల మధ్య సీప్లేన్ సేవల నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ ఊపందుకుంది.దీనిలో భాగంగా భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ)కి చెందిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టింది. రాష్ట్ర పర్యాటకశాఖ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఉన్నతాధికారులతో కలిసి ఏఏఐ ప్రతినిధులు హుస్సేన్‌సాగర్‌లోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. జల విమానాలు సురక్షితంగా నీటిపై దిగేందుకు (ల్యాండింగ్), పైకి ఎగిరేందుకు (టేకాఫ్) అవసరమైన నీటి లోతు, ఉపరితల వైశాల్యం, ప్రవాహ వేగం వంటి సాంకేతిక అంశాలను లోతుగా లెక్కించారు. దీంతోపాటు విమానం నీటిపై ప్రయాణించే మార్గం (ట్యాక్సీ పార్క్), ప్రయాణికులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా జెట్టీలు, ప్యాసింజర్ టెర్మినల్ సదుపాయాలు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చనే అంశాలపై సమగ్ర పరిశీలన జరిపారు.

కాంగ్రెస్ వ్యూహాలకు ఎదురుదెబ్బలు

హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఆ పార్టీ దూకుడును అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులు కోర్టుల్లో నిలవట్లేదు. బలమైన సెక్షన్లు నమోదు చేయకపోవడంతో కేసులు కోర్టుల్లో వీగిపోతున్నాయి. ఇది అధికార పార్టీ వర్గాల్లో తీవ్ర కలవరం రేపుతోంది. రాజకీయ ప్రత్యర్థుల దూకుడుకు కళ్లెం వేయాలని భావిస్తున్న కాంగ్రెస్ వ్యూహాలు అడుగుడుగునా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తమను అప్పటి ప్రభుత్వం ఎలా వేధించిందో, ఎన్నిసార్లు జైలుకు పంపిందో కాంగ్రెస్ నేతలు పదే పదే గుర్తుచేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్థాయిలో ప్రతిపక్ష నేతలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని భావించినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిని, ఇతర ప్రముఖ నాయకులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై అధికార పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు.అయితే.. పోలీసులు నమోదు చేస్తున్న కేసుల్లో గట్టి సెక్షన్లు ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రపు సెక్షన్ల కారణంగా నిందితులు సులభంగా కోర్టుల నుంచి ఊరట పొందుతున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ దక్కకపోగా, కొద్ది గంటల్లోనే బెయిల్ పై బయటకు వస్తున్నారు. ఇది కాంగ్రెస్ శ్రేణులను నిరుత్సాహపరుస్తోంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కఠినమైన పోలీసు చర్యలను ఎదుర్కొన్నామని.. కానీ ఇప్పుడు ప్రతిపక్షాలపై అలా ఎందుకు వ్యవహరించలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ భవిష్యత్తులో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటనే అభద్రతాభావం కొందరు నేతల్లో కనిపిస్తోంది.పోలీస్ యంత్రాంగం సరైన లీగల్ సెక్షన్లను ప్రయోగించడంలో విఫలమవుతోందని, దీనివల్ల అధికార పార్టీ పరువు పోవడంతో పాటు ప్రత్యర్థులకు రాజకీయ మైలేజీ దక్కుతోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ, తగిన ఆధారాలతో కూడిన పటిష్టమైన ఎఫ్ఐఆర్‌లు నమోదు కాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని వాపోతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కీలక చర్చ జరుగుతోంది. ఎంతమందిపై కేసులు పెట్టామనేదాని కంటే, పెట్టిన కేసులు ఎంత బలంగా ఉన్నాయనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. సోషల్ మీడియా పోస్టులు లేదా వ్యక్తిగత విమర్శల విషయంలో ప్రత్యర్థులను న్యాయపరంగా గట్టిగా నిలువరించాలంటే మరింత లోతైన లీగల్ రీసెర్చ్, పకడ్బందీ చట్టపరమైన చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.ఎదుటివారి దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ప్రస్తుత వ్యూహాత్మక లోపాలను సరిదిద్దకపోతే, అది రాబోయే కాలంలో పార్టీకి మరింత నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. ఏది ఏమైనప్పటికీ, చట్టపరమైన చిక్కులను అధిగమించి బీఆర్ఎస్ దూకుడును కట్టడి చేయడం కాంగ్రెస్ సర్కార్‌కు ప్రస్తుతం పెద్ద సవాల్‌గా మారింది.

ఓంకారేశ్వరస్వామి ఆలయం నుంచే అంతా

హైదరాబాద్, అక్టోబరు 9 : తెలంగాణ రాజకీయాల్లో మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు నది పరీవాహక ప్రాంతాల అభివృద్ధి, మరోవైపు చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణ పేరిట ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా మంచిరేవుల ప్రాంతంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఏకంగా రూ.1108.27 కోట్ల నిధులను కేటాయించింది. ఈ ఆలయానికి సుమారు 1,400 ఏళ్ల చరిత్ర ఉంది.ఈ ప్రాజెక్టును కేవలం ఆలయ పునరుద్ధరణకు మాత్రమే పరిమితం చేయట్లేదు. దీని వెనుక బలమైన రాజకీయ, వ్యూహాత్మక కోణాలు దాగి ఉన్నాయి. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై మొదటి నుంచి విపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మతపరమైన, సాంస్కృతిక అంశాలను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని ఆకర్షించాలని అధికార పార్టీ ఎత్తుగడ వేసినట్లు అర్థమవుతోంది. రూ.700 కోట్ల ప్రాథమిక అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.1,108 కోట్లకు పెంచడం ప్రభుత్వ ప్రాధాన్యతలను, సంకల్పాన్ని చాటుతోంది. దక్షిణ కాశీగా అభివర్ధిస్తూ చేపట్టబోయే ఈ అభివృద్ధి పనుల్లో రూ.598.98 కోట్లు కేవలం నిర్మాణ పనులకే కేటాయించడం విశేషం. అలాగే 100 అడుగుల భారీ శివుడి విగ్రహం, రాజగోపురాలు, పుష్కరిణి వంటి హంగులు దీనికి వన్నె తేనున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాలను అనుసంధానించేందుకు రూ.159.62 కోట్లతో ఆరు లైన్ల రహదారి నిర్మాణాన్ని కూడా చేపట్టాలని నిర్ణయించారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని, ముఖ్యంగా నార్సింగి, కోకాపేట, మణికొండ పరిసర ప్రాంతాల్లోని భూముల విలువను మరింత పెంచుతుందనే వాదన కూడా ఉంది.గత ప్రభుత్వాల హయాంలో ఓంకారేశ్వర ఆలయ పునరుద్ధరణ అంశం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్యాచరణ దిశగా అడుగులు వేస్తోంది. అయితే, ప్రజాధనాన్ని భారీగా వెచ్చిస్తున్న ఈ ప్రాజెక్టులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిర్దేశిత సమయంలోగా పారదర్శకంగా పూర్తవుతాయా లేదా అనేదే పెద్ద సమస్యగా మారింది. ఏది ఏమైనప్పటికీ, మూసీ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ ఆలయాల పునరుద్ధరణ తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపింది.

లక్కీ కిడ్స్ షాపింగ్ మాల్లో పవర్ కట్‌తో ఆగిపోయిన లిఫ్ట్

వికారాబాద్ : స్థానిక లక్కీ కిడ్స్ షాపింగ్ మాల్ లో లిఫ్ట్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆగిపోయింది. సుమారు గంట పాటు లిఫ్ట్ లో మహిళలు, చిన్నారులు చిక్కుకుపోయారు. లిఫ్టులో ఇరుక్కుపోయిన బాధితులు లు లోపల నరకయాతన పడుతుంటే కనీసం షాపు యజమానులు పట్టించుకోలేదని షాపు యజమానుల తీరు పై మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వివరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాంగ్ చేసారు.

మలుపులు తిరుగుతున్న రాజకీయం

రేవంత్ టార్గెట్‌గా కేటీఆర్ 'ఓపెన్ లెటర్స్'

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ప్రతిరోజూ కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా నిర్ణయాలు, వివాదాస్పద వ్యాఖ్యలు, బిఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న పోలీసు కేసుల విచారణల సందర్భంలో.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే కాంగ్రెస్ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖలు రాయడం , ఎక్స్ వేదికగా నేరుగా ట్యాగ్ చేస్తూ రేవంత్‌ను అదుపులో పెట్టుకోండి అని డిమాండ్ చేయడం చర్చనీయాంశమవుతోంది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యర్థి పార్టీ నాయకుడు ఫిర్యాదు చేస్తే రాహుల్ గాంధీ చర్యలు తీసుకుంటారా అంటే.. అసలు అటువంటి అవకాశమే లేదనేది అందరికీ తెలిసిన సత్యం. మరి లాజిక్‌కు అందని ఈ ఫిర్యాదుల వ్యూహం వెనుక కేటీఆర్ , బిఆర్ఎస్ ఆశిస్తున్న అసలు రాజకీయం ఏమిటి?కేటీఆర్ లక్ష్యం రాహుల్ గాంధీ ద్వారా రేవంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చేయడం కాదు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ప్రచారం చేసే భారత రాజ్యాంగ పరిరక్షణ , ప్రజాస్వామ్య విలువలు , వ్యక్తి స్వేచ్ఛ అనే సిద్ధాంతాలలోని నైతిక వైరుధ్యాన్ని జాతీయ స్థాయిలో ఎండగట్టడమే బిఆర్ఎస్ ప్రధాన వ్యూహం. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ సోషల్ మీడియా నేతలను అరెస్ట్ చేస్తుంటే , విపక్షాల ప్రతినిధులపై కేసులు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నను కేటీఆర్ సమాజం ముందుకు తెస్తున్నారు.ఈ వ్యూహంలో ఉన్న మరో కీలకమైన అంశం.. నైతిక బాధ్యత ను అధిష్ఠానం భుజాన పెట్టడం. రేవంత్ రెడ్డి చేసే వ్యాఖ్యలు , నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ అధికారిక విధానమా కాదా అని ప్రశ్నించడం ద్వారా, రేవంత్ చర్యలకు రాహుల్ గాంధీ కూడా నైతిక బాధ్యత వహించక తప్పని పరిస్థితిని బిఆర్ఎస్ కల్పిస్తోంది. రాహుల్ గాంధీ ఈ ఫిర్యాదులపై స్పందించకపోయినా లేదా మౌనంగా ఉన్నా.. అది రేవంత్ నిర్ణయాలకు రాహుల్ మద్దతు ఉందనే సంకేతం అని,

కాంగ్రెస్ మార్క్ సిద్ధాంతాలు కేవలం ప్రచారానికేనని నెటిజన్లలో ప్రచారం చేయడానికి బిఆర్ఎస్‌కు ఒక బలమైన లీడ్ లభిస్తోంది. దీనికితోడు, తెలంగాణ రాజకీయాలను కేవలం హైదరాబాద్ బోర్డర్లకే పరిమితం చేయకుండా జాతీయ మీడియా , ఢిల్లీ రాజకీయ వర్గాల్లోకి తీసుకెళ్లడానికి ఈ 'ఓపెన్ లెటర్స్' వ్యూహం తోడ్పడుతోంది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీని నేరుగా ట్యాగ్ చేస్తూ లేఖలు రాసినప్పుడు లేదా విమర్శలు చేసినప్పుడు నేషనల్ మీడియా కూడా దీనిపై దృష్టి సారిస్తోంది. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చే విమర్శలు, ఆరోపణలు జాతీయ స్థాయిలో హైలైట్ అయ్యి కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఏర్పడుతోంది.అలాగే, కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, సీనియర్ నేతల అసంతృప్తిపై మానసిక ఒత్తిడి పెంచడం కూడా ఇందులో దాగి ఉన్న మరో ప్లాన్. సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై ఢిల్లీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లడం వల్ల, కాంగ్రెస్‌లోని రేవంత్ వ్యతిరేక వర్గానికి లేదా పాతకాపులకు ఒక రకమైన రాజకీయ మద్దతు లభిస్తుందని, అది కాంగ్రెస్ అంతర్గత విభేదాలను మరింత ఉద్రేకపరుస్తుందని బిఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు, ఈ ఫిర్యాదులపై కాంగ్రెస్ శ్రేణులు , సీఎం రేవంత్ రెడ్డి చాలా తేలికగా స్పందిస్తున్నారు. ప్రత్యర్థి ఫిర్యాదులను చూసి ఏ హైకమాండ్ కూడా తమ ప్రజాదరణ ఉన్న ముఖ్యమంత్రిని తప్పు పట్టదని, కేటీఆర్ కేవలం సోషల్ మీడియా పబ్లిసిటీ మరియు కవరేజ్ కోసమే ఇటువంటి డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ డిజిటల్ వింగ్ తిప్పికొడుతోంది. కేటీఆర్ రాహుల్ గాంధీకి చేసే ఫిర్యాదులు రేవంత్ రెడ్డి పదవిని ఊడగొట్టడానికి కాదని, రాహుల్ గాంధీ నైతికతను ప్రశ్నించడం ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లో పడేయడానికి వేస్తున్న ఒక తెలివైన పొలిటికల్, మీడియా గేమ్ అని బీఆర్ఎస్ నేతలంటున్నారు.

కామ్రేడ్ నవ్వుల పువ్వులే

హైదరాబాద్ : కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' అని పిలిపించుకొంటున్న హీరో? శ్రీవిష్ణు. నిజానికి ఇలాంటి గుర్తింపు దక్కడం నిజంగా ఓ అదృష్టం. శ్రీవిష్ణు అలాంటి సరదా కథల్ని ఎంచుకొంటుంటాడు. తాను చిన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా, డైలాగ్ ని తనదైన శైలిలో మెలిక పెట్టినా.. ఓ చిరునవ్వు పెదాలపై పూస్తుంటుంది. 'సామజవరగమన', 'సింగిల్' సినిమాల్లో కామెడీతో మరింత చొచ్చుకుపోయాడు. తన సినిమాకు 'కామ్రేడ్ కల్యాణ్' అనే టైటిల్ పెట్టినా, అందులో ఉండేది కామెడీ కల్యాణే అని ఆడియన్స్ కూడా ఫిక్సయిపోతారు. తన మార్క్ అలాంటిది. టీజర్, ట్రైలర్ లోనూ దట్టమైన వినోదమే కనిపించేలా జాగ్రత్త పడ్డారు. మరి థియేటర్లోనూ నవ్వులు పండాయా, కామ్రేడ్ సృష్టించిన ఈ నవ్వుల విప్లవం.. ఎలాంటి ఫలితాన్ని ఇచ్చింది?మాడుగుల అనే ప్రాంతం అది. 1992.. నాటి కాలం. కల్యాణ్ (శ్రీవిష్ణు) ఆర్.నారాయణమూర్తి ఫ్యాన్. ఓ థియేటర్ ని లీజుకు తీసుకొని నారాయణమూర్తి సినిమాల్ని ఆడించుకొంటూ కాలం గడిపేస్తుంటాడు. అమ్మ (రాధిక) అంటే ప్రాణం. ఓసారి.. ప్రాణాపాయంలో ఉన్న తన అమ్మ ని.. కేరళ నుంచి వచ్చిన సితార (మహిమా నంబియార్) కాపాడుతుంది. ఆ క్షణం నుంచే సితార ప్రేమలో పడిపోతాడు కల్యాణ్. తన మనసులోని ప్రేమని సితారకు చెప్పాలనుకొంటున్న సమయంలో ఆమెకు సంబంధించిన ఓ నిజం బయటపడుతుంది. అదే సమయంలో.. సితారని ఓ ప్రమాదం నుంచి బయటపడేయాలంటే రూ.5 లక్షలు అవసరం అవుతాయి. అందుకోసం ఎవరూ చేయని ఓ సాహసం చేస్తాడు కల్యాణ్. అదేంటి? ఊర్లో.. కల్యాణ్‌గా ఉన్న హీరో.. అడవికి వెళ్లి కామ్రేడ్ కల్యాణ్ గా ఎలా మారాడు? అడవిలోకి వెళ్లాక కల్యాణ్ ని ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అనేది మిగిలిన కథ.శ్రీవిష్ణు సినిమా అంటేనే ఎంటర్టైన్‌మెంట్. ఈ జోనర్ సౌలభ్యం ఏమిటంటే? పెద్దగా కథ అవసరం లేదు. ప్రేక్షకులు లాజిక్కులు కూడా పట్టించుకోరు. ఊర్లో చాలా సాధారమైన జీవితాన్ని గడుపుతున్న కుర్రాడు.. సడన్ గా అన్నగా ఎలా మారాడు? అనుకోకుండా ఆ ఉచ్చులో ఎలా చిక్కుకోవాల్సి వచ్చింది అనేది ఇంట్రస్టింగ్ టాపిక్కే. దాని చుట్టూ కావల్సినంత వినోదం పండించొచ్చు. శ్రీవిష్ణు సినిమా అనేసరికి ప్రేక్షకులు కూడా లాజిక్కులు పట్టించుకోరు కాబట్టి.. పేపర్ మీద ఈ కాన్సెప్ట్ సేఫ్ గేమ్ అనిపించడంలో ఎలాంటి అనుమానం లేదు. ఫస్టాఫ్ కూడా చాలా జాలీగా, సరదాగా గడిచిపోతుంది. నక్సల్స్ పై కోపం పెంచుకొన్న పోలీస్ ఆఫీసర్ (షైన్ టామ్ చాకో) ఎపిసోడ్ నుంచి కథ ఆసక్తిగా మొదలవుతుంది. ఈ సినిమాకు నక్సల్ అనే పాయింట్ కీలకం కాబట్టి.. కథ మెల్లగా అడవిలోకి షిఫ్ట్ అవుతుంది కాబట్టి, తొలి సీన్ లోనే దర్శకుడు అందుకు కావాల్సిన పునాది వేసేశాడు.ఆ తరవాత.. ఓ అన్న పాటతో? శ్రీవిష్ణుని పరిచయం చేసి, మెల్లమెల్లగా తనక్యారెక్టర్ ని రివీల్ చేయడం, పేకాట ఆడే అమ్మ పాత్ర (రాధిక)ని కథలోకి ప్రవేశ పెట్టడం, ఆ తరవాత హీరోయిన్ ఎపిసోడ్.. ఇవన్నీ చక చక సాగిపోతాయి. హీరోయిన్ ఒరియా పిల్ల కావడం వల్ల కథకు ఒనగూరే అదనపు ప్రయోజనం ఏమీ లేదు. కేవలం కామెడీ కోసం రెండు మూడు ఎపిసోడ్లు రాసుకోవడానికి ఉపయోగపడింది. మరీ ముఖ్యంగా దుబాయ్ బాలు (సత్య)తో కామెడీ చేయించడానికి ఈ ట్రాక్ దోహదం చేసింది. దుబాయ్ నుంచి వచ్చినట్టు సత్య బిల్డప్పులు ఇవ్వడం, ఇంగ్లీష్ లో లవ్ లెటర్ రాయడం.. ఈ సీన్లు బాగా వర్కవుట్ అయ్యాయి. సత్య ఎప్పుడు కనిపించినా ఏదో ఓ జోక్ పేల్చి వెళ్తాడు. దాంతో తను కనిపించినప్పుడల్లా టైమ్ పాస్ అయిపోతుంది. ఉపేంద్ర లిమాయో ట్రాక్ కూడా కామెడీ కోసమే రాసుకొన్నాడు దర్శకుడు. కానీ ఎందుకో అది వర్కవుట్ అవ్వలేదు. ఆ ట్రాక్ కూడా పేలి ఉంటే బాగుండేది. ఫస్ట్ సీన్ లో ఉపేంద్ర కాస్త నవ్వించినా రాను రాను.. బోర్ కొట్టించాడు. కల్యాణ్ కామ్రేడ్ కల్యాణ్ అయ్యే ఎపిసోడ్ ఇంట్రస్టింగ్ గానే తీసుకొచ్చాడు (లాజిక్కులు పట్టించుకోకుంటే).ఫస్టాఫ్ అయ్యే సరికి 'కామ్రేడ్ కల్యాణ్'పై యావరేజ్ ఇంప్రెషన్ పడుతుంది. 'ఫర్లేదు.. టైమ్ పాస్ అయిపోయిందిలే' అనే ఫీలింగ్ వస్తుంది. అయితే సెకండాఫ్ లో కొన్ని సమస్యలు ఉన్నాయి. అడవిలో.. కామెడీ చేసే స్కోప్ లేకుండా పోయింది. చుట్టూ అన్నల్ని పెట్టుకొని కామెడీ చేయడం కష్టమే. సో.. అలాంటి చోట కథ, కథనాలు నత్త నడక నడుస్తాయి. మంత్రి ని కిడ్నాప్ చేసే ఎపిసోడ్ దగ్గర మళ్లీ కామెడీ పండించే ఛాన్స్ వచ్చింది. వెన్నెల కిషోర్ ని రంగంలోకి దింపి కొన్ని నవ్వులు పండించే ప్రయత్నం చేశారు. ఆ ఎపిసోడ్ ఓ మాదిరిగానే వర్కవుట్ అయ్యింది. అలాంటి కన్ఫ్యూజన్ కామెడీ బిట్లు చాలా చాలా చూసేశాం కాబట్టి, సీన్ మేకింగ్ లోనూ, రైటింగ్ లోనూ కొత్తగా ఏం అనిపించదు. సెకండాఫ్‌లోనూ సత్య ఉండేలా దర్శకుడు, రచయితలు జాగ్రత్త పడడం మంచి ఆలోచన. కానీ సత్య ఉన్నప్పటికీ కామెడీని సృష్టించలేకపోయారు. ఇలాంటి కథల్లో ఎప్పటికప్పుడు కొత్త పాత్రలు ఎంట్రీ ఇస్తూ ఉండాలి. ఆ పాత్రల్లోంచి వినోదం పండించం సులభం అవుతుంది. కామ్రేడ్ కల్యాణ్ లో ఉన్న పాత్రలనే వాడుకోవడంతో.. కామెడీ రాను రాను రొటీన్ అయిపోయింది. సెకండాఫ్ లో.. ఉపేంద్ర లిమాయో ట్రాక్ మరింత పేలవంగా సాగింది. క్లైమాక్స్ లో సందేశాలు దంచి కొట్టారు. ఇది శ్రీవిష్ణు సినిమా అని గుర్తెరిగి, క్లైమాక్స్‌ని సరదాగా ముగిస్తే బాగుండేది.శ్రీవిష్ణు ఆడుతూ పాడుతూ తన పాత్ర చేసేశాడు. తన టైమింగ్ తో విషయం లేని డైలాగ్ తో కూడా నవ్వించడం శ్రీవిష్ణు ప్రత్యేకత. అది అక్కడక్కడ ఈ సినిమాలోనూ కనిపించింది. శ్రీవిష్ణు కాకుండా మరో హీరో ఈ సినిమా చేసుంటే, కల్యాణ్ పాత్రని ఓన్ చేసుకోవడం కష్టమయ్యేది. శ్రీవిష్ణు వల్ల.. ఆ క్యారెక్టర్, అందులోంచి వచ్చిన ఫన్ వర్కవుట్ అయ్యింది. సత్య మరోసారి నవ్వించాడు. తను కూడా చిన్న చిన్న డైలాగులతోనే ఫన్ పుట్టించాడు. సెకండాఫ్ లో తన నుంచి ఇంకొంత కామెడీ రాబట్టుకొంటే బాగుండేది. ఉపేంద్ర లిమాయో మరీ రొటీన్ అయిపోతున్నాడు. తను ఈ జోన్ నుంచి వీలైనంత త్వరగా బయటపడాలి. షైన్ టామ్ చాకో క్యారెక్టర్ కూడా తేలిపోయినట్టు అనిపించింది. హీరోయిన్ పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేదు. రాధిక పాత్ర మొదట్లో ఉత్సాహంగా కనిపించింది. కానీ తర్వాతర్వాత.. ఆమె పాత్ర కూడా సైడ్ కి వెళ్లిపోయింది.ఒరియా పిల్ల పాట ఉత్సాహంగా ఉంది. ఆర్.నారాయణమూర్తి స్టైల్ లో ఒక ఎర్రపాట ఉంది. అది కూడా ఊపు తెచ్చే గీతమే. ఓ పాటని ఎడిటింగ్ లో తీసేయడం మంచి నిర్ణయం అనిపించుకొంది. శ్రీవిష్ణు సినిమాల్లో కాంటెంపరరీ డైలాగులు వినిపిస్తుంటాయి. అలాంటిదే 'పారడైజ్ కాకి' అనే డైలాగ్. దాన్ని నాని ఫ్యాన్స్ ఎలా తీసుకొంటారో చూడాలి. ఐడియా పరంగా సింపుల్ గా అనిపించినా, శ్రీవిష్ణు కి సూటయ్యే లైనే ఇది. దాన్ని ఫస్టాఫ్ లో శ్రీవిష్ణు స్టైల్ లో డీల్ చేసి నవ్వించారు. సెకండాఫ్ లో ఆ నవ్వులు కంటిన్యూ అయితే బాగుండేది. కానీ అలా జరగలేదు. కాస్త టైయమ్ పాస్ అయిపోతే చాల్లే అనుకొనే వాళ్లకు ఈ వారం 'కామ్రేడ్ కల్యాణ్' ఓ ఆప్షన్ కాగలదు. వరుసగా సెలవలు రావడం, పండంగ సీజన్, బాక్సాఫీసు దగ్గర మరో సినిమా లేకపోవడం.. కల్యాణ్ కు కలిసొచ్చే విషయాలు.

తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ

-కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో అట్టహాసంగా బతుకమ్మ ఉత్సవాలు

-కృష్ణవేణి విద్యాసంస్థల కరస్పాండెంట్ చందుపట్ల. తిరుపతి రెడ్డి , ప్రధానోపాధ్యాయులు బర్ల. శ్రీనివాస్

రామగిరి, అక్టోబర్ 09(ది క్రైమ్ న్యూస్):- బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, ప్రకృతిని, నదులను, స్త్రీత్వాన్ని గౌరవిస్తూ జరుపుకునే ఒక గొప్ప సామూహిక ఉత్సవమని కృష్ణవేణి విద్యాసంస్థల కరస్పాండెంట్ చందుపట్ల. తిరుపతి రెడ్డి , ప్రధానోపాధ్యాయులు బర్ల. శ్రీనివాస్ లు అన్నారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శుక్రవారం అట్టహసంగా ముందస్తు మన కృష్ణవేణి బతుకమ్మ ఉత్సవాలను విద్యాసంస్థల కరస్పాండెంట్ చందుపట్ల. తిరుపతి రెడ్డి , ప్రధానోపాధ్యాయులు బర్ల. శ్రీనివాస్ లు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనంతరం వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, ప్రకృతిని, నదులను, స్త్రీత్వాన్ని గౌరవిస్తూ జరుపుకునే ఒక గొప్ప సామూహిక ఉత్సవం. వర్షాకాలం ముగిసి, శరదృతువు ప్రారంభమయ్యే వేళ తెలంగాణ భూమి తీరొక్క అడవి పూలతో మైమరపిస్తున్నప్పుడు ఈ వేడుకలు మొదలవుతాయి.ఈ పండుగలో ఉపయోగించే తంగేడు, గునుగు, కట్ల, చామంతి, బంతి, గుమ్మడి వంటి పూలన్నీ ఔషధ గుణాలు కలిగినవి. పురుషులు ఈ పూలను సేకరిస్తే, మహిళలు వాటిని తాంబూలాలలో ఎంతో నైపుణ్యంతో గోపురాకృతిలో పేరుస్తారు. చివరగా ఈ పూల బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ఆ పూల ఔషధ గుణాలు నీటిని శుద్ధి చేస్తాయి.ప్రపంచానికి మన తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పిన పండుగ "బతుకమ్మ" అని గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరు సంస్కృతి, సాంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటించాలని, ఉత్తమంగా వ్యవహరించాలని తెలిపారు. బొడ్డమ్మ ఆరంభం నాటి నుండి మహా అష్టమి వరకు బతుకమ్మ ఆటను ఆకాశమే హద్దుగా అన్నట్టు వివిధ రకాల జానపద గేయాలు, ప్రకృతి పులకరించే పాటలతో చూడచక్కగా వేడుకలను జరుపుకుంటారని, ఊరూ, వాడ అని తేడా లేదనుకుండ రెట్టింపు ఉత్సాహంతో పండుగను వైభవోపేతంగా నిర్వహించుకుంటారని అన్నారు. సమాజం లో ఐక్యత, ప్రేమ అనురాగాన్ని ఆవిష్కరించే పండుగ ఇదేనని తెలుపుతూ ప్రకృతి ఒడిలో దొరికేటువంటి వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి, గౌరీమాత కృపను పొందుతారన్నారు. బతకమ్మకు అత్యంత ప్రీతికరమైనటు వంటి గౌరీమాతను గుమ్మడి పూలతో తయారు చేసి ఆ అమ్మవారి కృపను వారి పరివారానికి నిలుపు కుంటారని తెలియజేస్తూ బతుకమ్మ పండుగ ద్వారా ప్రేమ, అనురాగం చాలా వెల్లివిరిస్తుందని వారు చెప్పారు. ఎనిమిది రోజుల బతుకమ్మ వివిధ రకాల ప్రసాదాలతో ఆరాధించి అమ్మ వారి ఆశీస్సులను అధికంగా ఉండేలా చేస్తారని, ప్రత్యేకంగా అమ్మవారి శరన్నవరాత్రులు అత్యంత భక్తి, శ్రద్ధలతో నియమ,నిష్టలతో కఠినంగా ఉపవాసాలను పాఠించి పూజా కైంకర్యాలను నిర్వహిస్తారని, అమ్మవారిని పది రోజులలో పది అవతారాలలో సుందరంగా అలంకరించి, అమ్మవారిని సపరివారంగా సుహాసినిలందరు సుందరంగా ప్రతిష్ఠాపనకు మరియు ఆశీర్వచనానికి అట్టహాసంగా శ్రీలలిత సహస్ర నామ పారాయణ ద్వారా ఆహ్వానించి పూజా కార్యక్రమాలను చాలా గొప్పగా నిర్వహిస్తారని తెలిపారు. అందరూ విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పాఠశాలలో పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. అదే విధంగా సుమారు 50 పైగా బతుకమ్మలను విద్యార్థులు వివిధ రూపాల్లో తయారుచేసి వారి ఆనందాన్ని కొలాట ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రంజిత్ రెడ్డి మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కులాల లెక్కలు.. బిజెపికి చిక్కులు

కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించాలని కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా చెవిటివాని ముందు శంఖంలా ఉంటోంది. మంగళవారం (ఏప్రిల్ 1) కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ అంశంపై సవివరంగా ప్రస్తావించారు. కులాల వారీగా జనగణన ఆలస్యం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. యుద్ధాలు, అత్యవసర పరిస్థితులు, ఇతర సంక్షోభాల సమయంలో కూడా జనాభా లెక్కల సేకరణ జరిగిందని, కానీ చరిత్రలో మొదటిసారిగా ప్రభుత్వం రికార్డు స్థాయి లో జనగణన నిర్వహించడంలో జాప్యం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దీన్ని నిర్వహించడానికి ప్రభుత్వం ఇష్టపడటం లేదని స్పష్టమవుతోందని విమర్శించారు. ఖర్గే చెప్పిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి కులాల ప్రాతిపదికపై జనాభా గణనపై విముఖత ఉన్నట్టు తెలుస్తోంది. కులాల ప్రాతిపదికగా జనాభా లెక్కలను సేకరించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో సుప్రీం కోర్టు ముందు చేతులెత్తేసింది. అప్పటినుంచి ఈ సమస్య కొన్నేళ్లపాటు వాయిదా పడుతోంది. 1881 నుంచి దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఓసారి జనాభా లెక్కలను సేకరించడం పరిపాటిగా వస్తోంది. 1931 జనాభా లెక్కలకు ముందు మహాత్మాగాంధీ జనాభా లెక్కలు దేశానికి ఎంత ముఖ్యమో ఆయన గుర్తు చేశారు. మన ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి మనకు కాలానుగుణంగా వైద్య పరీక్షలు ఎంత అవసరమో జనాభా లెక్కలు కూడా అంతే అవసరంగా గాంధీజీ ఉదహరించడం ఇక్కడ గమనించాలి. అయితే కులాల వారీ జనాభా లెక్కలు మాత్రం బ్రిటిష్ వారి పాలనలోనే దేశం లో 1933లో చివరిసారి జరిగింది. అప్పటి నుంచి ఆగిపోయిన ఈ ప్రక్రియను తిరిగి చేపట్టాలన్న డిమాండ్ చిరకాలంగా వెనుకబడిన తరగతుల నుంచి వస్తోంది. 1933 నాటి కులాల వారీ సేకరణ ఆధారంగానే ఒబిసిలు దేశ జనాభాలో 36 శాతం మాత్రమే ఉంటారని ఒక వర్గం, 60 నుంచి 70 శాతం వరకు ఉంటారని మరోవర్గం ఎవరికి తోచిన విధంగా వారు వాదన లేవదీయడమే తప్ప కచ్చితమైన వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారు. అయితే దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు అధిక సంఖ్యలోనే ఉంటారని ఎక్కువ శాతం మంది అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం న్యాయం కాదని వెనుకబడిన తరగతుల ఆవేదన అరణ్య రోదనగా ఉంటోంది. విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 1990లో ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% కోటా కల్పించారు. అప్పటినుంచి తమ జనసంఖ్య ఎంతో తేల్చి ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఆ వర్గాలనుంచి బయలుదేరింది. 2001లోను, 2011లోను జనాభా లెక్కలతోపాటు కులాల వారీ లెక్కలు సేకరించాలన్న ఆలోచన అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అయితే యుపిఎ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల సేకరణలో వేర్వేరుగా సామాజిక, ఆర్థిక కులగణన పేరుతో కొంత సమాచారాన్ని సేకరించింది. ఈ సమాచారం తమకు అందజేస్తే జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల చట్టం కింద ఒబిసిలకు 27% రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలవుతుందని 2021లో మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. ఆ మేరకు సుప్రీం కోర్టులో కూడా వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. అయినా కేంద్రం చలించలేదు. ఆ సమాచారం తప్పుల తడకగా ఉందని, దానివల్ల ఎలాంటి ప్రయోజనం కలగదని కేంద్రం సాకులు చెప్పి తప్పించుకుంది. 2021 జనాభా లెక్కల సేకరణలో భాగంగా కులాల వారీ లెక్కలు సేకరించడం సాధ్యం కాదని కేంద్రం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా కుల ప్రాతిపదికన జనగణన చేపట్టాలని నాలుగేళ్ల క్రితం ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసినా ఫలించలేదు. ప్రతి పదేళ్లకు ఓసారి చేపట్టే జనాభా లెక్కల సేకరణలో ఎస్‌సి, ఎస్‌టిల జనగణన సాధ్యమవుతున్నప్పుడు ఇతర వెనుకబడిన తరగతుల వివరాలు సేకరించడం ఎందుకు కష్టమవుతుందని కాంగ్రెస్‌తో సహా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా గతంలో విపి సింగ్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోనే హింసాత్మక ఆందోళనలు చెలరేగడం మరిచిపోలేని వాస్తవం. కులాల గణన పేరు చెబితే కాషాయ నాథులకు కంపరం పుట్టుకొస్తోంది. దీనికి కారణం కులాల శాతాలు బయటపడితే అగ్రవర్ణాలకు దూరం కావలసి వస్తుందని వారి భయం. బిజెపి మొదటి నుంచి హిందుత్వ భావజాలంతో అగ్రవర్ణాలను అక్కునచేర్చుకుని వారిని ఓటు బ్యాంకుగా కొల్లగొడుతోంది. జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు, మైనారిటీలు దాదాపు 80% వరకు ఉన్నారు. వీరంతా పేదరికంలోనే మగ్గుతున్నారు. మిగిలిన 20% అగ్రవర్ణాలు. అగ్రవర్ణాలదే అన్నిటిలో పైచేయిగా ఉంటోంది. దేశ సంపద అంతా అగ్రవర్ణాల అనుభవంలోనే ఉందన్న వాస్తవం గణాంకాలతో బయటపడితే తమ ఉనికికే ముప్పు తప్పదన్న పిరికితనం కమలనాథులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులాల గణనకు ముందుకు రాకుండా ఏవో సాకులతో విపరీత కాలయాపన చేస్తోందన్న విమర్శలు కాంగ్రెస్ తదితర విపక్షాల నుంచి వస్తున్నాయి. అంతేకాదు ఈ సంవత్సరం బడ్జెట్‌లో జనాభా గణన కోసం రూ. 575 కోట్లు మాత్రమే కేటాయించడం బట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వానికి కులాల వారీ జనాభా లెక్కల సేకరణ బొత్తిగా ఇష్టం లేదనిపిస్తోందని రాజ్యసభలో విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యల్లో యదార్థం లేకపోలేదు.

సొంతింటి కలకు ప్రభుత్వాల మోకాలడ్డు

ధరలకు తోడు అనేక రకాల పన్నుపోట్లు

హైదరాబాద్ : హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. రియల్ రంగం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రజల్లో ఇల్లు కొనుక్కోవాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వా తీరు ఉంటోంది. భూముల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, ఇళ్లు అందుబాటులో లేకుండా పోవడం అన్నది అభివృద్ధికి సంకేతం కాదు. ఇది తిరోగమన చర్యగా చూడాలి. ప్రధానంగా రియల్ రంగంతో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రకాల వృత్తులు దీనితో పెనవేసుకుని వున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాలయాపన చేస్తూ...పోయేబదులు సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలి. ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనాలను కుంటున్న వారికి పన్నుల భారతం తడిసి మోపెడు అవుతోంది. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 20 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పుణ్యమా అని లోన్‌పైనా 50వేల అదనపు పన్నులు వేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు దోపిడీ కేంద్రాలుగా మారాయి. నిజానికి బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే కనిపిస్తోంది. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతు న్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్ధాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ప్రధాన మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ అభివృద్ధిలో దూసుకుని పోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి.

డంకీరూట్‌లో అక్రమంగా ప్రవేశం

తాజాగా పంజాబీ యువకుడు దుర్మరణం

న్యూఢిల్లీ : డంకీ రూట్..అంటే దొంగమార్గమని వేరుగా చెప్పనక్కరలేదు. అగ్రరాజ్యంలో ఈ రూట్లో ప్రవేశించేందుకు యత్నించిన అనేకమంది అసవులు బాసారు. ఇందులో అనేకదేశాల వారూ ఉన్నారు. భారీతయులు కూడా ఇలా ప్రతయ్నించి ప్రాణాలు పోగట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్రమంగా తమ దేశానికి వచ్చిన 104 మంది భారతీయులను ఇటీవల అమెరికా తిప్పి పంపిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు పక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దీంతో అగ్రరాజ్యంలోకి అక్రమంగా వెళ్లగలిగే మార్గాలపై చర్చ మొదలైంది. ఈనేపథ్యంలోనే తాజాగా ఓ పంజాబీ యువకుడు డంకీ రూట్ లో అమెరికా వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. 33 ఏళ్ల గుర్‌ప్రీత్‌సింగ్ గ్వాటెమాలాలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులు మీడియాకు వెల్లడించారు. 'నా సోదరుడు గుర్‌ప్రీత్ అమెరికా వెళ్లేందుకు మూడు నెలల కిందట ఇంటి నుంచి బయల్దేరారు. ఇందుకోసం చండీగఢ్‌లోని ఏజెంట్ బల్వీందర్‌సింగ్‌ను సంప్రదించాడు. అతడు రూ.16.5 లక్షలు తీసుకొని నా సోదరుడిని గయానా పంపించాడు. అక్కడ ఓ పాకిస్థానీ ఏజెంట్‌కు అప్పగించాడు. అనంతరం మరికొందరు వలసదారులతో కలిసి పనామా అడవి గుండా కొలంబియాకు బయల్దేరాడు. మధ్యలో ఓసారి మాకు ఫోన్ చేసి గ్వాటమాలాలోని హోటల్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఇటీవల ఓ వ్యక్తి మాకు ఫోన్ చేసి గుర్‌ప్రీత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పాడు. కారులో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని తెలిపాడు. ఆ తర్వాత ఐదారు నిమిషాలకే నా సోదరుడు చనిపోయినట్లు సమాచారమిచ్చారు' అని గుర్‌ప్రీత్ సోదరుడు తారాసింగ్ మీడియాకు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. తన సోదరుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సాయం చేయాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మృతుడి కుటుంబాన్ని పంజాబ్ రాష్ట్ర మంత్రి కుల్దీప్‌సింగ్ దలివాల్ పరామర్శించారు.

సిరిసిల్ల నేతన్నలపై అణచివేత ఆపాలి

ఉరిసిల్లగా మారిన సిరిసిల్లను ఆదుకునేందుకు, ఆకలి చావు లు, ఆత్మహత్యలు, వలసలను నివారించడానికి ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, ఆర్‌వీఎం వంటి పథకాలు తెచ్చింది. అవి కార్మికుల ఉపాధికి ఆధారమయ్యాయి. స్కూల్ విద్యార్థి, విద్యార్థినుల యూనిఫామ్‌లు, బతుకమ్మ పండుగకు బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్ల కార్మికుల ఉపాధికి భరోసానిచ్చాయి. బతుకమ్మ చీరల్లో అవినీతి జరిగిందని, నాణ్యత లేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని రద్దు చేసింది. బతుకమ్మ చీరల్లో నాణ్యత లేకపోతే అంతకంటే మంచి చీరలను తయారు చేయించాలి. అవినీతి జరిగితే అవినీతి చేసిన అధికారులపై, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి తప్ప ఉన్న పథకాలను తీసివేసి ఉపాధి లేకుండా చేసి కార్మికులను రోడ్డున పడేయడం ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సబబేనా? సంవత్సరన్నర కాలంలో 38 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వందలాది మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు మరోసారి పోరుబాట పట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో బతుకమ్మ చీరల స్థానంలో తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న 65 లక్షల మంది మహిళలకు రెండు చీరల చొప్పున 1 కోటి 30 లక్షల చీరలను ఉత్పత్తి చేయిస్తామని, తద్వారా కార్మికులకు ఉపాధి, మెరుగైన ఆదాయం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. చీరల ఉత్పత్తికి ఆర్డర్ తెచ్చుకున్న సంఘాలకు, యాజమాన్యాలకు ఒక మీటర్‌కు రూ.9 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ధర నిర్ణయించింది. కష్టపడి చీరలను నేసే కార్మికుడికి కూలి మాత్రం ప్రభుత్వం నిర్ణయించలేదు. ఇదెక్కడి న్యాయం? చీరల ఉత్పత్తికి కూలి ప్రభుత్వం నిర్ణయించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరితే మీరు యజమానులను అడగండి మాకు సంబంధం లేదని చేతులు దులుపుకోవడం సరైనదేనా? ఈ నేపథ్యంలో సిరిసిల్ల నేత కార్మికులు ఏప్రిల్ 1 నుండి సమ్మెకు దిగారు. ఈ సమ్మెను విచ్చిన్నం చేయడం కోసం సమ్మె చేస్తున్న కార్మికులను, వారికి అండగా నిలబడిన కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారు. కేసులు పెడతామని భయపెడుతున్నారు. కార్మికులను, నాయకులను పోలీసులు భయాందోళనలకు గురిచేయడం ప్రజాస్వామ్యబద్ధమేనా? తమకు ప్రభుత్వం కూలి నిర్ణయించాలని, పాలిస్టర్ వస్త్రానికి కార్మికుల ఒప్పందం ప్రకారం కూలి చెల్లించాలని, 2023లో కార్మికులకు చెల్లించాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని, 10 శాతం యారన్ సబ్సిడీని వర్తింపజేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను నిర్బంధించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకోవడం ప్రజాపాలన అనిపించుకుంటుందా? ప్రభుత్వానికి కార్మికుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిర్బంధం, అరెస్టులకు పాల్పడకుండా కార్మికులు అడుగుతున్న న్యాయమైన కోర్కెలను తీర్చాలి. సమస్యలను పరిష్కరించకుండా నిర్బంధించి పరిపాలన చేస్తామంటే కార్మికులు చూస్తూ ఊరుకోరు. ఇది పోరు తెలంగాణ.

నైతికబలమే ఆత్మశక్తి

ప్రభువు చుట్టూ ప్రజలు తండోపతండాలుగా ఉండేవారు. ఆయన సన్నిధిలో ఆకలి నిద్రలు మరచి పులకించిపోయేవారు. ప్రభువు పలుకులే వారికి దివ్యౌషధాలు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కొందరు అహంకారులు పట్టి పీడించేవారు. వారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు. అయినా వారంతా మొక్కవోని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రభువు దగ్గరే అచంచలమైన దీపాల్లా వెలుగుతుండేవారు. వారిని చూసి జాలిపడిన ప్రభువు.. 'ఆత్మవిషయమై దీనులైన మీరు ధన్యులుబీ పరలోకరాజ్యము మీదే' అని ఊరట కలిగించేవారు. ప్రభువు కొండమీద కూర్చొని అలా పలుకుతుంటే, చిన్నగా జాలువారే అమృతధారలు వారిలో జీవం ఉప్పొంగించేవి. అలా ఆయన మాటలు దుఃఖపడే వారిని ఓదార్చేవి. నీతి కోసం నిలబడే నైతిక బలమే ఆత్మశక్తిని, తృప్తినీ ఇస్తాయని ప్రభువు వారికి బోధిస్తుండేవారు. ప్రభువు బోధనలు ఆధ్యాత్మిక, భౌతిక, తాత్వికతకు మూలబీజాలుగా ఉండేవి. ఎందరెందరో బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసేవి. బాధితుల మనసుకు సాంత్వన చేకూర్చేవి.



ఆధ్యాత్మికం

పేదలకు విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం

● కేంద్ర, రాష్ట్ర అధికారులు సమన్వయంతో పనిచేయాలి ● దిశ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాలు

మేడ్చల్, అక్టోబరు 9: ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పేదలకు అందించే విద్య, వైద్య సేవలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో పాటు మున్సిపల్ చైర్మన్లు, వివిధ శాఖల కేంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీ శాఖల వారీగా సమీక్ష నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో నిరాశ్రయులైన పేదలకు ఆశ్రయం కల్పించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలకు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి పరిశుభ్రత పాటించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఆయాల పోస్టులను భర్తీ చేసి పనితీరును మెరుగుపరచాలని సూచించారు. గృహహింసకు గురవుతున్న మహిళలకు అండగా నిలిచే సఖి కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు అవసరమైన వైద్య పరికరాలు, మందులను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆసుపత్రుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రసవ గదుల్లో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల కొరత లేకుండా చూసుకోవాలని, పేదలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జిల్లాలో పనిచేస్తున్న పేద కార్మికులకు కూడా అత్యవసర వైద్య చికిత్స అందించేలా అన్ని ఆసుపత్రుల్లో తగిన ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. నగర వనాల యోజన కింద పట్టణ పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రహదారుల విస్తరణ పనులకు సంబంధించి అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని చెరువులు, తడి భూములను గుర్తించి వాటి పరిరక్షణకు కంచెలు ఏర్పాటు చేయాలని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, శిక్షణ పొందిన వారికి ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో పారిశ్రామిక, విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి బ్యాంకులు అందించే రుణాలపై ప్రజలకు వివరించాలని అన్నారు. బలహీన వర్గాలు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, ఇతర అర్హులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరయ్యేలా చూడాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రుణ పథకాల ప్రయోజనాలను అర్హులకు సకాలంలో అందించాలని పేర్కొన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు సమర్థంగా వినియోగించాలని, జిల్లా ఖనిజ నిధులను ప్రధానంగా విద్య, వైద్యం, అత్యవసర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగించాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, రహదారులు--భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనం నిర్దేశించిన పట్టిక ప్రకారం నాణ్యతతో అందించాలని, భోజన వివరాల పట్టికను పాఠశాలల్లో ప్రదర్శించాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తూ అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులైన లబ్ధిదారులను నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, ఉద్యానవన పంటలకు ఎదురయ్యే సమస్యలపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించారు. పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించడంతో పాటు వ్యవసాయ పరికరాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో శాఖల మధ్య సమన్వయం కీలకమని ఎంపీ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఆలోచనను విరమించుకోవాలి

● రూ.5,420 కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి ● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను డిమాండ్

నల్లగొండ జిల్లా ప్రతినిధి : అక్టోబర్ 9 నిడమనూరు: ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచే ఆలోచనను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) విరమించుకోవాలని, రూ.5,420.23 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం నిడమనూరు మండల కేంద్రంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీను మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు వెంటాడుతున్న సమయంలో మరోవైపు విద్యుత్ చార్జీలు పెంచాలని చూడటం ప్రజలపై అదనపు భారాలు మోపడమేనని విమర్శించారు. ప్రజల నుంచి విద్యుత్ చార్జీల రూపంలో మరింత ఆదాయం వసూలు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వ శాఖల బకాయిలను వసూలు చేయాలి. ప్రభుత్వ శాఖల నుంచి విద్యుత్ సంస్థలకు రావాల్సిన రూ.57,336 కోట్ల బకాయిలను వసూలు చేయకుండా సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ముందుగా ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను ఉపసంహరించు కోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి విద్యుత్ కోతల కారణంగా పంట పొలాలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని కొండేటి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రోజుకు ఏడు గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, తిరిగి రావడం వల్ల స్టార్టర్లు, మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాలంటే రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కొండేటి శ్రీను పిలుపునిచ్చారు. ఈ జాతీయ మహాసభల్లో వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతుల సంక్షేమం, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోమండ్ల గురువయ్య, వింజమూరు శివ, ముత్యాల కేశవులు, కోటేష్, యాదయ్య, సైదమ్మ, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగారం ఉన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

● తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థినుల వేడుకలు

మేడ్చల్, అక్టోబర్ 09: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలను నాగారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని ప్రతి తరగతి విభాగం నుంచి విద్యార్థులు ఒక్కో బతుకమ్మను తీసుకువచ్చి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల బంతిపూలతో పాటు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంప్రదాయ వైభవాన్ని చాటారు. బతుకమ్మల చుట్టూ మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించుకుని వేడుకల్లో పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కీసర మండల విద్యాధికారి పాల్గొనగా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మల చుట్టూ చేరి సంబురాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో విద్యార్థులు రూపొందించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పండుగల ప్రాధాన్యతను తెలియజేసే ఉద్దేశంతో పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ పండుగకు తెలంగాణ చరిత్ర, సామాజిక జీవనంతో విడదీయలేని అనుబంధం ఉందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు, ఆడపిల్లలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటుతుందని తెలిపారు. గతంలో సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్ష ఉండేదని, ఆడపిల్లల ప్రాధాన్యతను గుర్తించి వారిని గౌరవించాలనే సందేశాన్ని బతుకమ్మ పండుగ చాటుతుందని వివరించారు. ఆడపిల్లల పట్ల వివక్షకు తావులేకుండా సమాన అవకాశాలు కల్పించాలని, మహిళలను గౌరవించాలని ఈ వేడుకలు సందేశాన్నిచ్చాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువస్తూ సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తు తరాలకు వాటిని అందించవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో నాగారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, శ్రీదేవి, మాలోత్ నాయక్, వందన, వరమ్మ, రఘు, అజీజ్ అహ్మద్, సుమతి, అర్చన, సంజయ్, రాణి, సరిత, గాయత్రి, పద్మ, రమ, సత్యశ్రీ, కమల, పాండు రంగారెడ్డి, సుప్రజ, కౌసల్య, విద్యా వాలంటీర్లు స్వప్న, పావని, పవిత్ర, విశాలి, కార్యాలయ సిబ్బంది సౌజన్య, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

గోదావరిఖని ప్రతినిధి : గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో జీఎం గోపాల్ రెడ్డి, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం చైతన్య రావు ఆదేశాలతో పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రజిని ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రజిని మాట్లాడుతూ బతుకమ్మ పండుగను సాధారణంగా మహాలయ అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ పండుగలో తంగేడు, గునుగు, బంతి వంటి రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చుతారు అని మహిళలు, బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆనందంగా నృత్యం చేస్తారు అని అన్నారు. చివరి రోజున సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకొని, బతుకమ్మలను చెరువులు లేదా ఇతర నీటి వనరులలో నిమజ్జనం చేస్తారు అని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక. పూల సౌందర్యంతో, పాటల సందడితో, మహిళల ఆనందంతో తెలంగాణ నేలను పరిమళింపజేసే ఈ పండుగ మన సంప్రదాయాలకు గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఏ. రజనీతో పాటుగా అకాడమిక్ డీన్ గర్రెపల్లి ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్‌లు జ్యోతి, రమాదేవి, ఉపాధ్యాయినిలు, విద్యార్థినిలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మిర్యాలగూడలో మాన్యవర్ కాన్షీరామ్‌కు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఘన నివాళులు

మిర్యాలగూడ. : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు, సామాజిక సంస్కర్త మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బహుజనుల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కాన్షీరామ్ చేసిన కృషిని స్మరించుకున్నారు. సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం సాధించేందుకు ఆయన చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాలకు చెందిన నాయకులు పాల్గొని మాన్యవర్ కాన్షీరామ్‌కు నివాళులర్పించారు.

క్యాన్సర్‌పై అవగాహనతోనే ముప్పును తగ్గించవచ్చు

యశోద ఆసుపత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మచ్చ కిరణ్ కుమార్

మంచిర్యాల, అక్టోబర్ 9: క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మచ్చ కిరణ్ కుమార్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, జీవనశైలిలో మార్పులు, పొగాకు వినియోగం, వ్యాధిపై అవగాహన లోపం ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని ఓ ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటిలో పుండ్లు తగ్గకపోవడం, దీర్ఘకాలిక దగ్గు, శరీరంపై గడ్డలు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. 40--45 ఏళ్లు దాటినవారు వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మహిళలు రొమ్ముల స్వీయ పరీక్షపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, వైద్యుల సూచన మేరకు మామోగ్రఫీ, పాప్ స్మియర్ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు, మెరుగైన చికిత్స పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్సకు ఆధునిక రేడియేషన్ సాంకేతికత, రోబోటిక్ శస్త్రచికిత్స వంటి అధునాతన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి మేనేజర్ అంకం మల్లేష్ పాల్గొన్నారు.

మంచినీటిని ఎట్టి పరిస్థితుల్లో వృధా చేసుకోవద్దు

మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్

మహేశ్వరం అక్టోబరు 09 : వర్షాభావం తీవ్రంగా ఉన్నందున ప్రజలు మంచినీటిని వృధా చేసుకోకుండా వాడుకోవాలని మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ ప్రజలకు తెలిపారు. మహేశ్వరం గ్రామపంచాయతీ పాలకవర్గం శుక్రవారం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాబోయే రోజుల్లో అభివృద్ధి తోపాటు ప్రజల సమస్యలు చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఏల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురువకపోవడం వల్ల రాబోయే వేసవికాలంలో సైతం తాగునీటి సమస్యలు తలెత్తి అవకాశం ఉందని తెలిపారు. పరిస్థితిని ముందుగానే అంచనా వేసి గ్రామ ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామంలో సరఫరా చేస్తున్న సాగునీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృధా చేయకుండా చూడాలని గ్రామపంచాయతీ వాటర్ మ్యాన్ లను ఆదేశించారు. నీటి సరఫరా సమయంలో పైపుల నుండి నీరు లీకేజీలు అనవసరంగా నీరు కారుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన సూచించారు.

పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయండి

● మరోసారి ఎమ్మెల్సీ బరిలో అశోక్ సార్

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 09: పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయాలని, ఈసారి ఎన్నికల్లో విజయం నాదేనని వరంగల్ - ఖమ్మం - నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ సార్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది రాత్రికి రాత్రే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పుట్టుక వస్తున్నారని, అటువంటి తగిన గుణపాఠం చెప్పాలని, నిత్యం జనం కోసం పనిచేసే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులకు నిధులు లేవు, నియామకాలు లేవు. ఇంటికో ఉద్యోగం లేదు, ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు లేవు. ఊకదంపుడు ఉపన్యాసాలు, 420 హామీలు తప్ప నిరుద్యోగులకు మిగిలింది శూన్యం అని అన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో నాన్ లోకల్ కబ్జా అత్తెసరు ప్రభుత్వ ఉద్యోగాలు తెలంగాణలో నిరుద్యోగ భారతం. ప్రమాదపుటంచున ప్రభుత్వ విద్య నెలకొని ఉందని అన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓటు 90 వేల రెండో ప్రాధాన్యత ఓటు సాధించి బిఆర్ఎస్ ఓడిపోవడానికి తానే కారణమయ్యానని, ప్రధాన పార్టీలకు ముచ్చమటలు పట్టించానని అన్నారు. 90శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను కాదని కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తెలంగాణ పిసిసి రెడ్డి కాంగ్రెస్ గా మారిందని అన్నారు. బిఆర్ఎస్ సైతం ఓసీలకే టికెట్లు కేటాయించడానికి ప్రయత్నం చేస్తుందని అదే జరిగితే ఆ రెండు పార్టీలను, బీసీలు 100 శాతం బొంద పెట్టడం ఖాయమని అన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. రెండు పార్టీలు హైబ్రిడ్ మొక్కలను తెర మీదకి తెస్తున్నాయని, జన సంబంధం లేని వారు, తెలంగాణ అస్తిత్వం తెలియని వారు, డబ్బుల సంచులతో పోటీ చేయాలని చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం స్థానాలు బీసీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీలో కోర్టుల్లో నాటకలాడి బీసీలను నిండా ముంచిందని, ఇప్పుడు బీసీలకు సీట్లు కేటాయించడానికి అవకాశం ఉన్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 10 శాతం కూడా లేని ఓసీలు 70 శాతం అసెంబ్లీని కబ్జా పెట్టారని అన్నారు. గత 15 ఏండ్లుగా నిరుద్యోగుల కోసం, తెలంగాణ సమాజం కోసం పనిచేసానని అటు బిఆర్ ఎస్ ఇటు కాంగ్రెస్ రెండు పార్టీలు 18 కేసులు పెట్టి ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన నిరుద్యోగుల పక్షమే తప్ప ఏ ప్రభుత్వానికి అంట కాగలేదని, ప్రాణాలు ఫణంగా పెట్టి మూడు సార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేసానని, లక్షల మందికి తన ఆన్‌లైన్ పాఠాల ద్వారా తక్కువ ఫీజుతో, ఉచితంగా పాఠాలు భోదించానని అన్నారు. నిరుద్యోగుల పక్షాన నడి రోడ్డుపై నిలబడి పోలీసుల దీగ్భంధాలు చేధించుకుంటూ, నిత్యం కోర్టు మెట్లు ఎక్కుతు నిలబడి గొంతు ఎత్తానని నిరుద్యోగులు, బిసిలు, ఎస్సి, ఎస్టీ, మైనార్టీలు అండగా నిలబడతారని అన్నారు. ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 13 వేల ఉద్యోగాలు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతుందని, నిరుద్యోగులను నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. రెండు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని పాతంలోకి తొక్కుతారని విమర్శించారు. తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పన తన ఎన్నికల నినాదంని ప్రకటించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల ప్రకటన ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పవర్ సెక్టార్ లో 5300 ఉద్యోగాలతో ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డిఎస్సిని ఉద్యోగ క్యాలెండర్లో ప్రకటించినా ఇప్పటివరకు దిక్కు లేదన్నారు. సర్కారు బడిని బాగు చేస్తామని రేవంత్ రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేదన్నారు. 33 జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. పేరుకే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, తెలంగాణ అస్తిత్వంను ఆంధ్రుల గుప్పెట్లో పెట్టారని భౌగోళిక తెలంగాణ తప్ప సామాజిక తెలంగాణ సాధ్యం కాలేదని, తెలంగాణ ఉన్నత కులాల చేతిలో బందీ అయ్యిందని, ఎస్సీ ఎస్టీ, బిసి వర్గాల్లో చైతన్యం ఓటు రూపంలో వచ్చినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలందరూ ఐక్యమైనప్పుడే మనకు న్యాయం జరుగుతుంది. ఈ ఊడిగం ఇంకా ఎన్నాళ్లు అని ప్రశ్నించారు. మేమెంతో మాకంత నినాదంతో చేతులు బిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.వి గౌడ్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బానోతు భద్రు నాయక్ , నాగరాజు, జి. వెంకటనారాయణ, ప్రణీత్, కృష్ణ,బి రమేష్, డి ఉదయ్, సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్‌లో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

- ప్రమాదకర ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై అవగాహన.. నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలి

మేడ్చల్, అక్టోబర్ 09: రహదారి ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రమాదకర ప్రాంతాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్‌లో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటిని బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. కూడళ్లు, మలుపులు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని తగ్గించి, రహదారిపై వెళ్లే పాదచారులు, ఇతర వాహనదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రత్యేకించి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వంటి రద్దీ కూడళ్ల వద్ద వాహనదారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, ట్రాఫిక్ సంకేతాలను గమనిస్తూ ప్రయాణించాలని సూచించారు. రహదారిపై ప్రయాణించేటప్పుడు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఇతర వాహనాలకు తగినంత దూరం పాటిస్తూ, సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమేనని, రహదారి భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, అక్టోబర్ 09 : సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఆయన ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు తమ చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు . ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు యూనియన్లు, సంఘాలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులంతా కలిసి ఒక ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు . ఆ కమిటీ ముందుకు వస్తే అధికారులు తో మాట్లాడి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. సుల్తానాబాద్, ఓదెల మండలాలతో పోలిస్తే పెద్దపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో స్థల లభ్యత కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల జాడను గుర్తించేందుకు అధికారులు నిరంతరం అన్వేషిస్తున్నారని వివరించారు . నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, సంబంధిత సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచిస్తూ, అధికారులతో కలిసి సమష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పూర్తి భరోసా ఇచ్చారు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

శరీర సంక్షేమమే.. మన క్షేమం
ఆరోగ్యంపై యువత దృష్టి సారించాలి

- కల్వచర్లలో నూతన జిమ్ ప్రారంభం - సర్పంచ్ శారద కుమారస్వామి..

రామగిరి, అక్టోబర్ 09: -ఆరోగ్యమే మహాభాగ్యం. మనిషి ఆరోగ్యంగా ఉంటేనే దేన్నయినా సాధించగలడనీ యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిత్యం వ్యాయామం చేయాలని కల్వచర్ల సర్పంచ్ రెండ్ల శారద కుమారస్వామి సూచించారు. రామగిరి మండలం కల్వచర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆమె గోదావరిఖని ఏసిపి మడత రమేష్ గౌడ్, రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వ్యాయామాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. జిమ్ ద్వారా అందుబాటులోకి వచ్చిన సదుపాయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిమ్ నిర్వాహకుడు ముజీబ్ కుమారుడు యువతకు వ్యాయామ సదుపాయాలు కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీ యమని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు సర్పంచ్, ఏసిపి, ఎస్సై లను సన్మానం చేశారు.

జనసేన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

మధిర ప్రతినిధి,, అక్టోబర్ 9: మధిర నియోజకవర్గ జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు డేవిడ్ ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గ బోనకల్ లోని శుక్రవారం నాడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మధిర శాసనమండలి ఎన్నికల సమన్వయకర్త నల్ల సురేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో జనసేన పార్టీ బలాన్ని చాటాలని, క్షేత్రస్థాయిలో శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఓటర్లను ఎలా కలుపుకోవాలనే అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఓటు కేంద్రం పరిధిలో అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల నమోదును వేగవంతం చేయాలని, ప్రతి కేంద్రంలో క్రియాశీలక కార్యకర్తలు గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి సమన్వయ లోపం లేకుండా ఓటర్లను నిరంతరం కలుస్తూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సమన్వయకర్త దాసరి రావిష్, రాజు నాయక్, ప్రచార విభాగ నాయకులు సజ్జనపు భరత్, ఎండి ఫరీద్, విద్యార్థి విభాగ నాయకులు గంధం ఆనంద్, బోనకల్ మండల నాయకులు ఎస్.కె బాజీ బాబా, గుగులోత్ దుర్గా, పున్నం రోజా, పున్నం సతీష్, పొన్నం రామకృష్ణ, తాళ్లూరి రాజేశ్వరరావు, ముదిగొండ మండల నాయకులు జొన్నలగడ్డ భద్ర, ఈశ్వర్, అనుముల నరేష్, మధిర మండల నాయకులు పగడాల పవన్ కుమార్, వీర మహిళ నాయకురాలు తోట దీపిక, చింతకాని మండల నాయకులు చింతల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో ఇందిరమ్మ ఇళ్ల దందా
వసుళ్ల పర్వం మొదలైన వైనం

భూపాలపల్లి/కాటారం/అక్టోబర్ -9:: పేదోడి సొంతింటి కల నెరవేర్చా నే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంద్రమ్మ ఇళ్ల పథకం కొంతమంది ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా అందిన కాడికి దోచుకుంటున్నారని సమాచారం. ఇందిరమ్మ రెండో విడతలో భాగంగా గ్రామంలో స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు ఓ అధికారి కుమ్మక్కై ఇందులో అర్హత లేకున్నా ఓ వ్యక్తికి సైతం లబ్ధిదారుల వద్ద 30 వేల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ కమిటీ ఎక్కడ పోయింది. ఇదే నిజమైతే ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసే కేటుగాళ్లను కఠినంగా శిక్షించాలని ఈ కేటుగాళ్లు తీసుకున్న పేర్లను ఎట్టి పరిస్థితులలో కూడా ఇందిరమ్మ పేర్ల జాబితాలో నమోదు కానీయకుండా మండల అధికారులు దృష్టి సారించాలని, ఇందిరమ్మ కమిటీల ద్వారానే నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

రాజ్యాంగాన్ని సవరించైనా సరే బీసీ లకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలి...

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్

హైదరాబాద్ రాజ్యాంగాన్ని సవరించైనా బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ,దేశ జనాభాలో సగానికి పైన జనాభా కలిగిన బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.సామాజిక న్యాయం, సమాన అవకాశాలు రాజ్యాంగ స్ఫూర్తిలో అంతర్భాగమని పేర్కొన్నారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్య, ఉద్యోగ రాజకీయ ప్రాతినిధ్యంలో తగిన అవకాశాలు కల్పించాలన్నారు.ప్రస్తుత రిజర్వేషన్ పరిమితుల కారణంగా బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా అవకాశాలు కల్పించడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, బీసీల హక్కులు సాధించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని జాజుల లింగం గౌడ్ స్పష్టం చేశారు.

కమ్యూనిటీ హాల్‌కు అనుమతులు కోరుతూ వినతి

మేడ్చల్, అక్టోబర్ 09: బీజేఆర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన తుది అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు ఎస్.ఎ. రహీంతో కలిసి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే స్థానిక నివాసితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు వివరించారు. కాలనీవాసులు వివాహాలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు, సామూహిక సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనువైన ఉమ్మడి వేదిక అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇలాంటి కార్యక్రమాల కోసం ప్రైవేటు ఫంక్షన్ హాళ్లపై ఆధారపడాల్సి వస్తోందని, కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే కాలనీవాసులకు ఆర్థిక భారం తగ్గడంతోపాటు సౌకర్యవంతంగా కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిపాదిత నిర్మాణానికి సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి, మిగిలిన తుది అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనుమతులు లభిస్తే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్ కేవలం వేడుకలకే కాకుండా కాలనీ సంక్షేమ సమావేశాలు, ప్రజా కార్యక్రమాలు, సామాజిక అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. కాలనీల అభివృద్ధిలో ప్రజలకు అవసరమైన సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు సానుకూలంగా స్పందించి అనుమతులు మంజూరు చేస్తారని, త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణం కార్యరూపం దాల్చుతుందని కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ తరగతులను జయప్రదం చేయండి

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 09: సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ తరగతులు అక్టోబర్ 11,12, 13తేదీలలో సత్తుపల్లిలో (బత్తుల వెంకటేశ్వరరావు నగర్) నిర్వహిస్తున్నామని పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి ఎస్ కె లాల్ మియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన ఆదివారం "తత్వశాస్త్రం" అంశాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సాయంత్రం "వర్గం - కులం" అంశాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణ, 12వ తేదీన సోమవారం "జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు" అంశాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే సూర్యం, సాయంత్రం "సరుకు - శ్రమ -ఆదనపు విలువ" అంశాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎల్ పద్మ, 13వ తేదీ మంగళవారం "పార్టీ కార్యక్రమం" అంశాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం హన్మేష్, సాయంత్రం "పార్టీ నిర్మాణం - పని విధానం" అంశాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రమ బోధిస్తారనీ ఎస్ కె లాల్ మియా తెలిపారు. నేడున్న రాజకీయ, ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టు విప్లవో ద్యమాలలో పనిచేస్తున్న కార్యకర్తలకు సిద్ధాంత, రాజకీయ అధ్యయనం, ఆచరణ అత్యంత అవసరమని, అందుకోసం కార్యకర్తలకు రాజకీయ శిక్షణ ఇస్తున్నామని ఎస్ కె లాల్ మియా తెలిపారు. జిల్లాలో ఉన్న డివిజన్ కమిటీ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 09: ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన నివేదికలను నిర్దేశించిన నమూనాలో వాస్తవ సమాచారంతో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వాస్తవ వివరాలు సమర్పించకుండా నిర్లక్ష్యం వహిస్తే సమీక్షలు కొనసాగించడంతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో పథకం అమలుకు ఎవరు బాధ్యత వహిస్తున్నారో స్పష్టంగా నిర్ధారించుకొని, ప్రతి అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. - **మండల స్థాయిలో ఎంపీడీవోలదే పూర్తి బాధ్యత:** మండల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఎంపీడీవోలు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హౌసింగ్ ఏఈలు ఎంపీడీవోల సమన్వయంతో పనిచేయాలని, సర్వే వివరాల సేకరణ, నివేదికల సమర్పణ, క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. **-అర్హులైన దరఖాస్తులను ఎల్-1 జాబితా లోకి తీసుకురావాలి:** ఎల్-1 జాబితాలోని దరఖాస్తులను గెజిటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతను నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్-2 జాబితాలోని దరఖాస్తుదారుల అర్హత, భూమి పత్రాల లభ్యతను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు సమన్వయంతో పరిశీలించి, అర్హులైన వారిని నిబంధనల ప్రకారం ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలని సూచించారు. భూమి పత్రాలు లేవనే కారణంతో అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం సరికాదని కలెక్టర్ పేర్కొన్నారు. భూమి ప్రభుత్వ భూమా, ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూమా, లేక అభ్యంతరాలు లేని ఇతర భూమా అనే అంశాలను సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని నిర్ధారించాలని తెలిపారు. స్థానిక సర్పంచ్‌లు, గ్రామ పెద్దలతో చర్చించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. భూమికి సంబంధించిన యాజమాన్య పత్రాలు అందుబాటులో లేకపోయినా, నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ బిల్లులు, ఇతర ఆధారాలను పరిశీలించి, మిగిలిన అర్హతలు సరిపోతే దరఖాస్తులను ఎల్-1 స్థాయికి పంపించాలని ఆదేశించారు. ఈ అంశాలపై శిక్షణ సమయంలోనే స్పష్టమైన సూచనలు జారీ చేశామని తెలిపారు. **- ఎల్-0, ఎల్-3, కొత్త దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి:** ఎల్-3 జాబితాలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారిని ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్-2, ఎల్-3, ఎల్-0 జాబితాల్లోని దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారిని ఎల్-1 స్థాయికి తీసుకురావాలని సూచించారు. ఎల్-0, కొత్త దరఖాస్తుల వివరాలను నిర్దేశించిన నమూనాలో తయారు చేసి హౌసింగ్ పీడీకి పంపాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇందుకోసం అన్ని మండలాలకు ఒకే విధమైన నమూనాను రూపొందించాలని సూచించారు. గెజిటెడ్ అధికారుల పరిశీలన అనంతరం అర్హులైన ఎల్-1 దరఖాస్తులు కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయని, అనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి విచారణ వివరాలు, స్పష్టమైన సిఫార్సులు, సమర్థన నివేదికలను కలెక్టర్‌కు భౌతికంగా సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి సిఫార్సులు పంపించాలని సూచించారు. **- స్లాబ్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్లాబ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లకు చెల్లించే 25 శాతం మొత్తానికి సంబంధించి స్లాబ్ విస్తీర్ణ నిబంధనలను పాటించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా స్లాబ్ వేయని ఇళ్లకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో ప్రత్యేకంగా మీడియా సమావేశాలు నిర్వహించాలని, స్లాబ్ నిబంధనలపై ప్రత్యేక పత్రికా ప్రకటన విడుదల చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో ఎల్-3 జాబితా నుంచి ఇళ్లు మంజూరై, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభించి, పనుల వివరాలు నమోదు చేసిన లబ్ధిదారులకు ఒకేసారి మినహాయింపుగా ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందని తెలిపారు. అయితే పనులు ప్రారంభించని, నిర్మాణ వివరాలు నమోదు కాని ఇళ్లకు ఈ మినహాయింపు వర్తించదని స్పష్టం చేశారు. ఇలాంటి ఇళ్ల లబ్ధిదారులు ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభించకుండా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా గుర్తించిన ఇళ్లకు సంబంధించి ఈ సమాచారం లబ్ధిదారులకు తప్పనిసరిగా చేరాలని సూచించారు. అర్హత పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం ఎల్-1 జాబితాలోకి మార్పు జరిగిన తరువాతే తదుపరి నిర్మాణ పనులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన తరువాత కూడా పనుల్లో పురోగతి లేకపోతే సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత హౌసింగ్ ఏఈలు, తహసీల్దార్లు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి రెండు పడక గదుల ఇళ్ల వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని ఆదేశించారు. **- క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించాలి :** ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రాధాన్యతను క్షేత్ర స్థాయి సిబ్బంది అర్థం చేసుకొని బాధ్యతా యుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించి పనుల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఇందిరమ్మ ఇళ్ల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు, తల్లాడ, రఘునాథ పాలెం, ఖమ్మం అర్బన్, మధిర తహసీల్దార్లు, ఈడీఎం దుర్గాప్రసాద్, ఇందిరమ్మ ఇళ్ల ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన: 142 కి పైగా పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

●ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి

భూపాలపల్లి, అక్టోబర్ -9: యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై న మంత్రి అన్ని స్టాళ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 142కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా, అనుభవం, నైపుణ్యాలను పెంచుకుంటే రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం పొందే అవకాశాలు ఉంటాయన్నారు. వ్యవసాయం, కూలీ పనులు, చిన్న వ్యాపారాలు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి యువత పప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అర్హతలతో పాటు నైపుణ్యాలు ఉన్నప్పుడే మెరుగైన ఉద్యోగాలు, పదోన్నతులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి మరింత మందికి ఉపాధి కల్పించేలా ప్రైవేటు సంస్థలతో సమన్వయం చేస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు మంత్రి వివరించారు. గ్రూప్-1, 2, 3, 4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన యువత ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాలు సాధించేలా జాబ్‌మేళాలు దోహదపడతాయని పేర్కొన్నారు. జాబ్‌మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా యువత ప్రాథమికంగా ఎంపికైనట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని కంపెనీలు ఒక్కొక్కటి 100 నుంచి 400 మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ప్రాంతీయ పరిమితులు విధించుకోకుండా, ఎక్కడ అవకాశం వచ్చినా అందిపుచ్చుకోవాలని సూచించారు. నిరంతరం నైపుణ్యాలను పెంచుకుంటూ కష్టపడి పనిచేస్తే మెరుగైన భవిష్యత్తు సొంతమవుతుందని భరోసా ఇచ్చారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, పట్టణంలో రోడ్ల విస్తరణ, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి ద్వారా స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ భూపాలపల్లి నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా గొప్ప అవకాశమన్నారు. సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. టాస్క్ ద్వారా జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థ సహకారంతో శిక్షణ కేంద్రానికి విశాలమైన హాలు, ఏసీ వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి కూడా కృషి చేస్తున్నామని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. గత సంవత్సరం నిర్వహించిన మెగా జాబ్ మేళా లో 2700 మందికి ఉద్యోగ అవకాశాలు. కల్పించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు 142కు పైగా కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. స్థానికంగానే కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నందున యువత తమ అర్హతలకు తగిన ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు పత్రాలు అందజేశారు భూపాల్ పల్లి జిల్లా కేంద్రాలు జాబ్ మేళా నిర్వాహనలు విశేష కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంకీర్త్, టాస్క్ సీఈఓ ప్రదీప్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి శోభకు కిరీటం బతుకమ్మ

-ప్రగతి పాఠశాలలో అంగరంగ వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు -పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి

రామగిరి, అక్టోబర్ 09:- బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు , ప్రకృతి శోభకు కిరీటం బతుకమ్మ ప్రతీక అని పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి అన్నారు. స్థానిక సెంటినరీ కాలనీలోని ప్రగతి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి వేడుకల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి కొప్పుల గోవర్ధన్ రావు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గార్మి షరీఫ్ వేడుకలు

రామగిరి సెప్టెంబర్ 9:-రామగిరి మండలం సెంటినరీ కాలనీలో ముస్లిం సోదరులు గ్యార్మి షరీఫ్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక మస్జిద్లో శుక్రవారం ప్రత్యేక నమాజ్ చేసిన అనంతరం బైరకు (జెండా) తీసుకొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గౌసేపాక్ జెండా గద్దెపై జెండాను ప్రతిష్టింపజేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయురారోగ్యాలతో ఉండాలని పాడిపంటలు పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లోమాజీ సర్పంచ్ ఎండి మంజూర్ అధ్యక్షుడు ఇమాముద్దీన్, క్యాషియర్ ఎండి ముజీబ్, ఎండి సలీం, రహీముద్దీన్, అబ్రార్, డాక్టర్ మోయిన్ భాష, మత గురువు మెహబూబ్ ఆలం, హుస్సేన్ బాబా, జహూర్, జావీద్, మురాజ్, షమీం, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా వర్ధంతి సందర్భంగా చిత్రపటాని పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా పి డి ఎస్ యు కార్యదర్శి జే గణేష్

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 09: శుక్రవారం క్యూబా విప్లవకారుడు, సామ్రాజ్యవాద వ్యతిరేకి చేగువేరా వర్ధంతి సందర్భంగా ఇల్లందు పట్టణంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్‌యు) ఆధ్వర్యంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పి డి ఎస్ యు ప్రధాన కార్యదర్శి జే గణేష్ మాట్లాడుతూ క్యూబా దేశంలో పుట్టి వైద్య వృత్తిని అభ్యసించి యువకుడిగా కమ్యూనిస్టు జీవితాన్ని ప్రారంభించి క్యూబా దేశ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు మోటార్ సైకిల్ యాత్ర చేసి క్యూబా ప్రజలను విముక్తి మార్గాన్నా నడిపించి అమెరికా సామ్రాజ్య వాదాన్నికి వ్యతిరేకంగా పోరాటాన్ని చేస్తూ క్యూబాలో కార్మిక రాజ్యాన్ని స్థాపించి బొలివియా ప్రజల విముక్తి కోసం క్యూబా వదిలి బొలివియాకు వెళ్లి పోరాటం చేస్తున్న క్రమంలో అమెరికా పోలీసులకు చిక్కి అమరుడైన చేగువేరా ప్రపంచ దేశాల యువ చిహ్నంగా మారాడని సామ్రాజవాదానికి వ్యతిరేకంగా చేగువేరా పోరాటం నిత్య స్ఫూర్తిదాయకమని, నేడు పెట్టుబడిదారీ ఆధిపత్య దేశాలు తమ సామ్రాజవాదాన్ని విస్తరించేందుకు యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని చేగువేరాస్ఫూర్తితో సామ్రాజవాదాన్ని విద్యార్థులు యువత వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. కుల, మత రాజకీయాలతో దేశ అభివృద్ధి కుంటుపడుతుందని నేడు యువత దేశ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకొరకు చేగువేరాను స్ఫూర్తిగా తీసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందు, వేణు, చరణ్, గోపాల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హాలియాలో కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం నిర్మాణానికి స్థల పరిశీలన

నల్గొండ, ప్రతినిధి అక్టోబర్ 9 : హాలియా పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి రోజువారీ పర్యవేక్షణ కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం హాలియా రామాలయం పక్కన ఉన్న ఎన్ఎస్‌పీ కాల్వకట్ట వెంబడి కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పరిశీలించారు. పట్టణంలో కూరగాయల వ్యాపారులకు అనుకూలమైన వసతులు కల్పించడంతో పాటు, మార్కెట్ నిర్వహణకు అవసరమైన స్థలాన్ని గుర్తించే దిశగా ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిసింది. దుకాణాల సముదాయం నిర్మాణం కార్యరూపం దాల్చితే కూరగాయల వ్యాపారులకు సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, పట్టణ ప్రజలకు కూడా మార్కెట్ వసతులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ స్థల పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, ఐదో వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంజీరా హై స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మంజీరా స్కూల్ తరపున ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు శాంతినగర్‌లోని మంజీరా హై స్కూల్‌లో బతుకమ్మ పండుగ సంబరాలు అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగాయి. పాఠశాల ప్రధాన ఉపద్యారాయులు అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను పాఠశాల ఆవరణలో ఉంచి, విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ కోలాటం ఆడారు. అనంతరం ఉపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనం బతుకమ్మ పండుగ. ప్రకృతిని దైవంగా భావించి పూజించే గొప్ప పండుగను విద్యార్థులకు పరిచయం చేయడం, మన సాంప్రదాయాలను తరువాతి తరాలకు అందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ ప్రతి ఇంట సంతోషాన్ని ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలను సుఖ సంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈ సంబరాలలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లి తండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడి కుటుంబానికి ఎంపీ ఈటల పరామర్శ

మేడ్చల్, అక్టోబర్ 09(: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పబ్బోజు మురళి కార్తీక్ కుటుంబాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నెల 6వ తేదీ రాత్రి 11.45 గంటల సమయంలో కుషాయిగూడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బండ్లగూడ రామలింగేశ్వర కాలనీకి చెందిన పబ్బోజు మురళి కార్తీక్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం మృతుడి నివాసానికి వెళ్లి ఆయన తండ్రి విజయేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేసి, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలరాజు, నరేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ తదితర బీజేపీ నాయకులు పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మురళి కార్తీక్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

మాటల వంతెన కట్టింద్రు.. మానేరు వంతెన మరిచింద్రు..

● శంకుస్థాపన ఘనం... నిర్మాణం శూన్యం! ● భజనకు బాజాలు ● బ్రిడ్జికి బండరాళ్లు. ● ఏడాది గడిచినా పునాది లేదు. ● 80 కోట్ల వంతెనకు మోక్షం లేదు!● ప్రకటనలకు రెక్కలు.. పనులకు సంకెళ్లు! ● భజనలతో బ్రిడ్జి కట్టగలరా..? ● పేట ప్రజల సూటి ప్రశ్న! ● ప్రత్యేక కథనం..

వంతెన నిర్మాణ స్థలంలో గుంత కూడా లేని దృశ్యం

బ్యూరో,: "అభివృద్ధి పరుగులు పెడుతోంది..." "చిరకాల కల నెరవేరబోతోంది...""కోట్ల రూపాయలతో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూపు నారాయణపేట నుండి జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య మానేరు మీద వంతెన..." ఇలా మాటలకు మాత్రం కొదవ లేదు. కానీ వాగు వద్దకు వెళ్లి చూస్తే... పరుగులు తీస్తున్నది అభివృద్ధి కాదు.. కాలమే! నాలుగు నెలల కింద మొదటి పుట్టినరోజు జరుపుకున్న శంకుస్థాపన రాయి దిక్కు లేక దిక్కులు చూస్తున్నది. వంతెన లేదు.. పిల్లర్లు లేవు.. పునాదులు లేవు. కనీసం ఒక్క పిల్లర్ కోసం గుంత కూడా కనిపించడం లేదని స్థానికులే చెబుతున్నారు. అయితే రూ.80 కోట్ల వంతెన ఎక్కడుంది? కాగితాలపైనా.. ప్రకటనల్లోనా..? లేక ఫొటోల్లోనేనా.. ? ఇదే ఇప్పుడు పేట ప్రజల అసలు ప్రశ్న. ఏడాది గడిచినా గుంత కూడా తవ్వలేకపోతే.. వంతెన పూర్తయ్యేది ఎప్పుడు? రూప్‌నారాయణపేట--విలాసాగర్ మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మాణం అంటూ గత సంవత్సరం జూన్ లో హడావుడి మొదలైంది. అట్టహాసంగా శంకుస్థాపన జరిగింది. హామీలు వచ్చాయి. ప్రకటనలు వెలువడ్డాయి. పనులు వేగవంతం చేస్తామని బడాయి మాటలు బాగానే వినబడ్డాయి. కానీ నిర్మాణ స్థలంలో మాత్రం... "ఇక్కడ వంతెన నిర్మాణం జరుగుతుంది" అని చెప్పే బోర్డు తప్ప, వంతెన ఆనవాళ్లు కనిపించడం లేదు. ఒక పిల్లర్‌కు పునాది వేయడానికి ఇంత సమయం పడితే ఈ ప్రాజెక్టుకు గడువు ఎన్ని యుగాలు? ప్రజలు అడుగుతున్న ప్రశ్న ఇదే. అధికారులను ఆదేశించామని చెప్పడం సులువు. పనులకు నిధుల కొరత లేదని చెప్పడం ఇంకా సులువు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పడం మరింత సులువు. కానీ జేసీబీలు దించి గుంత తవ్వించడానికి మాత్రం ఎందుకింత ఆలస్యం? ఇదే ప్రజలకు అర్థం కావడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రాంతాన్ని సందర్శించినప్పుడల్లా పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారనే ప్రచారం ఉంది. అయితే ఆ ఆదేశాల ప్రభావం నిర్మాణ స్థలంలో కనిపించకపోతే.. ఆదేశాలు ఎక్కడ ఎగిరి పోయాయి? ఫైళ్లు ఎక్కడ మురిగి పోయాయి? పనులు ఎక్కడ ఆగిపోయాయి? అనే ప్రశ్నలకు ఎవరు సమాధానం చెప్పాలి? కాంట్రాక్టర్‌కు గిట్టుబాటు కాదా..? ఇక ఇప్పుడు అసలు మలుపు. వంతెన పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ప్రస్తుత పరిస్థితుల్లో పని చేయడానికి వెనుకంజ వేస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో వినిపిస్తోంది. టెండర్ సమయంలో అంచనా వేసిన వ్యయంతో ఇప్పుడు పని పూర్తి చేయడం సాధ్యం కాదని.. ప్రాజెక్టు తనకు నష్టదాయకంగా మారుతుందని కాంట్రాక్టర్ చెబుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. మానేరు వాగులో ఇసుక కింద భారీ బండరాళ్లు ఉండటం, వాటిని తొలగించేందుకు అదనపు వ్యయం అవసరం అవుతుందనే వాదన కూడా వినిపిస్తోంది. ఇది నిజమైతే సమస్య ఎక్కడుంది? టెండర్ దశలో ఇవన్నీ పరిశీలించలేదా? సాంకేతిక పరిశీలన జరిగిందా? మట్టి, రాళ్ళు, నీటి ప్రవాహం వంటి అంశాలపై అధ్యయనం జరిగిందా? ఇవేవీ లేకుండానే శంకుస్థాపన జరిగిందా? అంచనాలు సరిగానే తయారయ్యాయా? కాంట్రాక్టర్ తప్పుకుంటే తదుపరి చర్య ఏమిటి? ప్రజలకు సమాధానం కావాల్సింది వీటికే. చిరకాల కోరిక పేరుతో.. చిరకాల నిరీక్షణా? ఈ వంతెనను ఓదెల మండల చిరకాల కోరికగా ప్రచారం చేశారు.అయితే ప్రజల్లో మరో చర్చ కూడా మొదలైంది. ఈ వంతెన నిజంగా అత్యధిక ప్రజలకు ఉపయోగపడే మార్గంలోనే వస్తుందా? పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి కానీ, మడక నుంచి కానీ, కనగర్తి నుంచి కానీ అనుసంధానం కల్పించి ఉంటే మరింత మంది ప్రజలకు ప్రయోజనం ఉండేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఆ వాదనలో నిజమెంత? ప్రభుత్వం చేసిన అధ్యయనం ఏమిటి? ఎంతమంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది? ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారా? కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే ముందు ఈ ప్రశ్నలకు సమాధానం ఉండాలి. ఎందుకంటే ప్రజాధనం అంటే ఎవరి సొంత డబ్బు కాదు. నాయకుడి ప్రకటనకు చప్పట్లు కొట్టేవారు ఉంటారు. సోషల్ మీడియాలో పొగిడేవారు ఉంటారు. పాలాభిషేకాలు చేసేవారు కూడా ఉండొచ్చు. కానీ ప్రజలకు మాత్రం కావాల్సింది ఒక్కటే వంతెన! భజనతో వంతెన కట్టలేరు. ప్రకటనలతో పిల్లర్లు నిలబడవు. ఫొటోలతో ప్రయాణం సులభం కాదు. పనిచేసిన నాయకుడికి ప్రచారం అవసరం లేదు.. పని కనిపిస్తుంది! ఇక్కడ మాత్రం పని కనిపించకపోయినా ప్రచారం మాత్రం కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యపై ప్రశ్నించాల్సిన వారు ప్రశ్నించకపోతే.. అధికారులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్న పరిస్థితి ఏర్పడుతుంది. "అన్నీ బాగున్నాయి" అని చెప్పేవారు మాత్రమే ఉంటే.. బాగోలేని విషయాలను ఎవరు బయటపెడతారు? అందుకే ఇప్పుడు పేట ప్రజలు అడుగుతున్నారు- వంతెన ఎప్పుడు మొదలవుతుంది? ఎప్పుడు పూర్తి అవుతుంది? కాంట్రాక్టర్ ఎందుకు ముందుకు రావడం లేదు? ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంది? రూ.80 కోట్ల ప్రాజెక్టు భవితవ్యం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? ఇక శంకుస్థాపన రాయి కాదు.. పని చూపించాలి! రెండేళ్లుగా ఓపిక పట్టారు. మాటలు విన్నారు. హామీలు నమ్మారు. ఇక మళ్లీ "త్వరలో" అనే మాట వింటే సరిపోదని స్థానికులు అంటున్నారు. తేదీ చెప్పాలి.గడువు చెప్పాలి. పని మొదలు పెట్టాలి. లేకపోతే ఈ వంతెన కూడా మరో "ప్రకటనల ప్రాజెక్టు"గా మిగిలిపోతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు క్షేత్రస్థాయిలో నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే... శంకుస్థాపనకు చప్పట్లు కొట్టిన ప్రజలే ఇప్పుడు పనులు ఎక్కడని అడుగుతున్నారు! మానేరు వాగుపై వంతెన కావాలి... మాటల వంతెన కాదు.

అమరుల ఆశయాల సాధన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దాం

● ఆకుల భూమయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపించాలి ● తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16వ ఆవిర్భావ దినోత్సవంలో నాయకుల డిమాండ్

రామగిరి, అక్టోబర్ 09:- తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ అధ్యక్షతన అమరవీరుల స్తూపం పెద్దపల్లి జిల్లా కేంద్రం వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య పతాకావిష్కరణ చేశారు.తర్వాత జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ, 2010 అక్టోబర్ 9న ప్రజా యుద్ధనౌక గద్దర్ తొలి అధ్యక్షుడిగా ఏర్పడిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16 సంవత్సరాలుగా పౌర ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, దున్నేవాడికి భూమి, నీళ్లు--నిధులు--నియామకాల సాధన కోసం అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించిందన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్, పులిమామిడి మద్దిలేటి, ఆకుల భూమయ్య, కనకాచారి, రవీందర్ రెడ్డి, నల్ల వసంత్ తదితరులు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నేటికీ వారి ఆకాంక్షలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక తెలంగాణ వాదాన్ని బలంగా వినిపిస్తూ ప్రజలను చైతన్యపరిచిన ఆకుల భూమయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివాసీల హక్కుల పరిరక్షణకు పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ఐడిపిఎల్ వంటి పరిశ్రమలను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, కౌలు రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని, దళిత కుటుంబాలకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఇచ్చి సాగునీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో ప్రజా సంఘాలు, విద్యార్థులు, యువకులు, కార్మికులు, రైతులు కీలక పాత్ర పోషించారని అన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామిక, సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం ప్రజా ఫ్రంట్ తన పోరాటాలను కొనసాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, భూమి, కార్మిక హక్కులు వంటి రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఇతర ప్రజా సంఘాలతో కలిసి భవిష్యత్తులో విస్తృత ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ, తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు ప్రభుత్వ పథకాలు, రుణాలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు అందేలా చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు శాశ్వత పరిష్కారాలు చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యలపై ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.దళిత లిబ రేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ మాట్లాడుతూ విద్యారంగంలో శాస్త్రీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని, ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు. మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టి అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు.ప్రజాస్వామిక హక్కులను పరిరక్షించాలని, ప్రజల నిరసన తెలిపే హక్కును హరించే నిర్బంధ చట్టాలను రద్దు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారు కలలుగన్న సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇతర సంఘాల ప్రతినిధులు ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు కె.విశ్వనాథం, రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డి రాజుల సంపత్, రైతుకూలి సంఘం (ప్రజా పంథా) జిల్లా అధ్యక్షులు ఏల్ . భీమన్నా, కునారం భూసాధన సమితి కన్వీనర్ గూళ్ల రాజన్న తమ సందేశాలు వినిపించారు.ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ యాకూబ్ ఆలపించిన గీతాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యులు కే రాజు, కాంపల్లి అంజయ్య, దస్తగిరి, మోహన్ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బండారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలకు దూరం.. ప్రకృతి సాగుకు చేరువ

● విత్తనాలే సంపదగా.. ప్రకృతే పెట్టుబడిగా పంట కోత ను ప్రారంభించిన సర్పంచ్ రెండ్ల శారద- కుమారస్వామి

రామగిరి, అక్టోబర్ 09- మట్టిని నమ్ముకున్నారు.. ప్రకృతిని ప్రేమించారు.. విత్తనాల్లోనే భవిష్యత్తును చూశారు. రసాయనాల వినియోగం పెరుగుతున్న వ్యవసాయ రంగంలో ప్రకృతి ఆధారిత సాగుకు ప్రాధాన్యమిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు రామగిరి మండలం కల్వచర్లకు చెందిన యాదగిరి పద్మావతి--శ్రీనివాస్ దంపతులు. సుమారు 3 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో దాదాపు 400 రకాల విత్తనాలను సేకరించి, వాటి ఆధారంగా 242 రకాల పంటలను సాగు చేస్తూ వైవిధ్యభరితమైన వ్యవసాయానికి నాంది పలికారు. పంటను పండించడమే కాకుండా విత్తనాల వైవిధ్యాన్ని కాపాడుతూ, ప్రకృతి ఆధారిత ఉత్పత్తుల తయారీతో తమ వ్యవసాయ క్షేత్రాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. వీరు సాగు చేసిన పంట కోతను గ్రామ సర్పంచ్ రేండ్ల శారద--కుమారస్వామి ప్రారంభించడం ఈ కార్యక్రమంలో విశేషంగా నిలిచింది. విత్తనాల్లో వైవిధ్యం.. వ్యవసాయంలో కొత్త ఆలోచన వ్యవసాయం అంటే పెట్టుబడి పెట్టడం, పంట పండించడం, దిగుబడి కోసం ఎదురుచూడటమే కాదు.. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విత్తన సంపదను కాపాడుకోవడం కూడా ముఖ్యమేననే సందేశాన్ని యాదగిరి దంపతుల ప్రయత్నం అందిస్తోంది. సుమారు 400 రకాల విత్తనాలను సేకరించి, 242 రకాల పంటలను సాగు చేయడం ద్వారా విభిన్న పంటలపై తమ ఆసక్తిని చాటుతున్నారు. ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా అనేక రకాల పంటలను సాగు చేయడం ద్వారా వ్యవసాయంలో వైవిధ్యానికి ప్రాధాన్యమిస్తున్నారు. విత్తనం నుంచి పంట వరకు ప్రకృతితో అనుబంధాన్ని కొనసాగిస్తూ సాగు చేయాలనే ఆలోచన ఇలాంటి ప్రయత్నాలకు ప్రేరణగా నిలుస్తోంది. సంప్రదాయ విత్తనాల పరిరక్షణ, సేంద్రియ సాగుపై అవగాహన, భవిష్యత్తు తరాలకు విత్తన సంపదను అందించాలనే లక్ష్యాలకు ఇలాంటి వ్యవసాయ క్షేత్రాలు వేదికలుగా నిలవగలవు. - పంటతోపాటు ఉపాధి అవకాశాలు పంటలు పండించడానికే పరిమితం కాకుండా ఆవు పేడతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయడంపైనా దంపతులు దృష్టి సారిస్తున్నారు. పూజా సామగ్రి, నూనె ప్రమిదలు, విభూది వంటి ఉత్పత్తులతోపాటు హెయిర్ ఆయిల్, నొప్పుల ఉపశమనానికి వినియోగించే ఆయిల్‌ను తయారు చేస్తున్నట్లు సర్పంచ్ వివరించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఇలాంటి ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఆదాయ అవకాశాలను అన్వేషించవచ్చనే ఆలోచనకు ప్రాధాన్యం లభిస్తోంది. - ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తుకు భరోసా నేల ఆరోగ్యం, విత్తనాల వైవిధ్యం, ప్రకృతి వనరుల పరిరక్షణ వ్యవసాయ భవిష్యత్తుకు కీలకమైన అంశాలు. ఈ నేపథ్యంలో ప్రకృతి ఆధారిత సాగుపై రైతుల్లో అవగాహన పెంచడం, విత్తనాల సేకరణకు ప్రోత్సాహం అందించడం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం అవసరం. ఇలాంటి ప్రయత్నాలకు తగిన సాంకేతిక సహకారం, మార్కెట్ మద్దతు లభిస్తే మరింత మంది రైతులు వైవిధ్యభరితమైన సాగు వైపు అడుగులు వేసే అవకాశం ఉంటుంది. - సర్పంచ్ చేతుల మీదుగా పంట కోత ప్రారంభం కల్వచర్ల గ్రామంలో యాదగిరి పద్మావతి--శ్రీనివాస్ దంపతులు సాగు చేసిన పంట కోత కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రేండ్ల శారద--కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా 400 రకాల విత్తనాలు, 242 రకాల పంటల సాగు, ఆవు పేడతో తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీ శ్రీదర్ తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

ధర్మపురి, అక్టోబర్ 9, : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజారంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థినులు తెలంగాణ జానపద బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ బతుకమ్మను కొలిచారు. మన సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగ నందు విద్యార్థులు తల్లిదండ్రులు కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్ల జనార్ధన్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల

ధర్మపురి, అక్టోబర్ 9, : ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన చెన్నోజి రామయ్య, గాజుల మల్లేశం జైన గ్రామానికి చెందిన లక్కం రాజన్న, సిగిరి గంగన్న, కొన్నూర్ పల్లె గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ మరియు ప్రస్తుత కో-ఆప్షన్ డైరెక్టర్ కల్లెపు మాధవ రెడ్డి లు ఇటీవలే అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందగా వారి కుటుంబలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈసీఐఎల్‌లో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌కు తల్లిదండ్రులదే బాధ్యత

మేడ్చల్, అక్టోబర్ 9: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్--2026'లో భాగంగా శుక్రవారం ఈసీఐఎల్ చౌరస్తా వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, యువత, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి. నరేందర్ రావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రావు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం, అతివేగంగా వెళ్లడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. పిల్లలకు చట్టవిరుద్ధంగా వాహనాలు అప్పగించవద్దని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ సంకేతాలను పట్టించుకోకపోవడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనదారులందరూ వేగ పరిమితులను పాటిస్తూ ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని సూచించారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు సంయమనం పాటించాలని, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా విలువైన ప్రాణాలను బలిగొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కార్లు, బస్సుల డ్రైవర్లు రహదారులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను ప్రోత్సహించడం 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్--2026' ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేగం కంటే ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగేందుకు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు



రామగిరి, అక్టోబర్ 09:- కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. నూతులకుంట్ల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శుక్రవారం ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్ల పొదలు, మట్టిని తొలగించి ప్రాంతాన్ని శుభ్రం చేశారు. అలాగే గ్రామంలోని ప్రతి వార్డులో బతుకమ్మలను ఏర్పాటు చేసే ప్రదేశాలను శుభ్రపరిచారు. పండుగ సందర్భంగా మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు నిమజ్జన ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫిక్ సోహెల్, పంచాయతీ సెక్రెటరీ రాము,వార్డు సభ్యులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

సౌతాఫ్రికా ముందు 282 పరుగుల టార్గెట్

స్పోర్ట్స్

ఆస్ట్రేలియా రెండవ ఇన్నింగ్స్ లో 207 పరుగులకు ఆలౌట్

క్రికెట్ అభిమానుల ఉత్కంఠను తారాస్థాయికి చేర్చిన ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ (%ఔజ%) ఫైనల్ 2025లో, దక్షిణాఫ్రికాకు ఆస్ట్రేలియా 282 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. లార్డ్స్‌లోని బౌలర్‌లకు స్వర్గధామమైన పిచ్‌పై ఈ లక్ష్యం దక్షిణాఫ్రికాకు ఒక సవాలుగా మారనుంది. ఆస్ట్రేలియా తమ రెండవ ఇన్నింగ్స్ లో 207 పరుగులకు ఆలౌట్ కావడంతో, మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం 74 పరుగులతో కలిపి మొత్తం 281 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించుకుంది. మ్యాచ్ మొదటి రెండు రోజులు బౌలర్లదే ఆధిపత్యం. ఇరు జట్ల బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్ లో 138 పరుగులకు ఆలౌట్ కాగా, ఆస్ట్రేలియా 212 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా రెండవ ఇన్నింగ్స్ లో కూడా టాప్ ఆర్డర్ తడబడినప్పటికీ, మిచెల్ స్టార్క్ (58), జోష్ హేజెల్ వుడ్ (17) చివరి వికెట్ కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పి ఆస్ట్రేలియాను గౌరవప్రదమైన స్థితికి చేర్చారు. లార్డ్స్ లో 250కి పైగా పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం టెస్ట్ చరిత్రలో కేవలం మూడు సార్లు మాత్రమే సాధ్యమైంది. 1984లో వెస్టిండీస్ 344 పరుగులను, 2004లో ఇంగ్లాండ్ 282 పరుగులను, 2022లో ఇంగ్లాండ్ 277 పరుగులను విజయవంతంగా ఛేదించాయి. ఈ గణాంకాలు దక్షిణాఫ్రికా ముందున్న సవాలును స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అయితే, ఈ డబ్ల్యూటీసీ ఫైనల్ లో ఏ క్షణంలోనైనా మ్యాచ్ స్వరూపం మారే అవకాశం ఉంది. పిచ్ ఇంకా బౌలర్లకు అనుకూలంగా ఉన్నప్పటికీ, నాలుగవ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడానికి కొంత తేలికపడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఈ కఠినమైన లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టిస్తారా, లేదా ఆస్ట్రేలియా తమ బౌలింగ్ పదునుతో డబ్ల్యూటీసీ టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా అనేది చూడాలి. తొలి రోజు తరహాలోనే రెండో రోజు కూడా బౌలర్ల హవానే నడిచింది. మొత్తం 14 వికెట్లు నేలకూలాయి. అంతకుముందు 43/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ బెడింగ్‌హమ్(111 బంతుల్లో 6 ఫోర్లతో 45), టెంబా బవుమా(84 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 36) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్(6/28) ఆరు వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. కమిన్స్‌కు తోడుగా మిచెల్ స్టార్క్(2/41) రెండు వికెట్లు తీయగా..జోష్ హాజెల్ వుడ్(1/27)కు ఓ వికెట్ దక్కింది. వర్షం అంతరాయం కలిగించడం సౌతాఫ్రికా కొంపముంచింది. వర్షం అనంతరం పిచ్ కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా మారడంతో సౌతాఫ్రికా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సఫారీ బౌలర్లు నిప్పులు చెరిగారు. దాంతో ఉస్మాన్ ఖవాజా(6), కామెరూన్ గ్రీన్(0), స్టీవ్ స్మిత్(13), ట్రావిస్ హెడ్(9), బ్యూ వెబ్‌స్టర్(9), ప్యాట్ కమిన్స్(6) తీవ్రంగా నిరాశపరిచారు. మిచెల్ స్టార్క్ సాయంతో అలెక్స్ క్యారీ పోరాడాడు. ఈ జోడీని విడదీసే అవకాశాలను సౌతాఫ్రికా చేజార్చుకుంది. డీఆర్ఎస్‌లను వృథా చేసుకోవడంతో పాటు స్టార్క్ ఇచ్చిన క్యాచ్‌లను అందుకోలేకపోయింది. దాంతో ఆసీస్ గౌరవప్రదమైన స్కోర్ అందుకుంది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా విజయం సాధించాలంటే అద్భుతం జరగాలి. తొలి ఇన్నింగ్స్‌లో 200 పరుగులు చేయలేకపోయినా.. సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 200 ప్లస్ లక్ష్యాన్ని అందుకోవడం కష్టమనే చెప్పాలి.



టీ20 ఇన్నింగ్స్‌లో కొత్త ప్రపంచ రికార్డు

సూర్యవంశీ, గేల్ రికార్డ్‌లను బ్రేక్ చేసిన పై అలెన్

మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. టోర్నమెంట్‌లోని మొదటి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ ఫిన్ అలెన్ సంచలనం సృష్టించాడు. శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ తరపున వాషింగ్టన్ ఫ్రీడమ్ పై అలెన్ కేవలం 51 బంతుల్లో 151 పరుగులు చేసి, టీ20 క్రికెట్ చరిత్రలో పలు రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ అసాధారణ ఇన్నింగ్స్‌తో శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ 123 పరుగుల భారీ తేడాతో వాషింగ్టన్ ఫ్రీడమ్ ను చిత్తు చేసింది. ఫిన్ అలెన్ ఇన్నింగ్స్‌లో అత్యంత ఆకర్షణీయమైన అంశం అతను బాదిన సిక్సర్ల సంఖ్య. అలెన్ 19 సిక్సర్లు కొట్టి, టీ20 ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ (18 సిక్సర్లు) రికార్డును అధిగమించాడు. 2017లో బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ లో రంగపూర్ రైడర్స్ తరపున క్రిస్ గేల్ ఈ రికార్డును నెలకొల్పగా, ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ కూడా 2024లో 18 సిక్సర్లతో ఈ రికార్డును సమం చేశాడు. ఇప్పుడు ఫిన్ అలెన్ 19 సిక్సర్లతో వారిద్దరినీ అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించాడు. అలెన్ తన 150 పరుగులను కేవలం 49 బంతుల్లోనే సాధించి, టీ20 క్రికెట్ లో అత్యంత వేగంగా 150 పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు డెవాల్డ్ బ్రేవస్ (52 బంతులు) పేరిట ఉండేది. ఫిన్ అలెన్ 151 పరుగుల ఇన్నింగ్స్ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నమోదైంది. గతంలో నికోలస్ పూరన్ 2023 ఫైనల్ లో చేసిన 137 పరుగులే అత్యధికం. కేవలం 34 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. ఇది టీ20 ఫ్రాంచైజీ లీగ్ లలో క్రిస్ గేల్ (30 బంతులు, ఐపీఎల్ 2013) తర్వాత రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ. శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్ పుణ్యమా అని 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. ఇది చరిత్రలో అత్యధిక టీమ్ స్కోరుగా నిలిచింది. అమెరికా గడ్డపై టీ20 మ్యాచ్ లో 200 పరుగుల మార్కును దాటిన తొలి జట్టుగా యునికార్న్స్ నిలిచింది. 123 పరుగుల తేడాతో గెలిచిన శాన్ ఫ్రాన్సిస్కో యునికార్న్స్, %మీాజ% చరిత్రలో అత్యధిక పరుగుల తేడాతో విజయం సాధించిన జట్టుగా రికార్డు సృష్టించింది. వాషింగ్టన్ ఫ్రీడమ్ కు కెప్టెన్ గా వ్యవహరించిన గ్లెన్ మాక్స్ వెల్, అలెన్ బ్యాటింగ్‌ను అభినందించాడు. పిచ్ బ్యాటింగ్ కు అనుకూలంగా ఉందని, బౌండరీలు చిన్నవిగా ఉన్నాయని, కానీ అలెన్ ఆధిపత్యం తమ ప్రణాళికలను దెబ్బతీసిందని పేర్కొన్నాడు. ఫిన్ అలెన్ ఈ రికార్డు బ్రేకింగ్ ఇన్నింగ్స్ తో మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. రాబోయే మ్యాచ్ లలో మరిన్ని అద్భుత ప్రదర్శనలను ఆశించవచ్చు.

ఇంగ్లాండ్ పర్యటన నుంచి మధ్యలోనే వెనుదిరిగిన గంభీర్

టీమ్‌ఇండియా ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. ఈ టూర్?లో ప్రత్యర్థి ఇంగ్లాండ్?తో భారత్ ఐదు టెస్టు మ్యాచ్?ల సిరీస్ ఆడనుంది. జూన్ 20న తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో భారత జట్టు నెట్స్?లో తీవ్రంగా శ్రమిస్తోంది. శుక్రవారం ఇంగ్లాండ్?తో ఇన్?ట్రా స్క్వాడ్ మ్యాచ్ కూడా ఆడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో హెడ్ కోచ్ గంభీర్ శుక్రవారం భారత్?కు బయల్దేరాడు. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా ఇంగ్లాండ్ పర్యటన నుంచి మధ్యలోనే వచ్చేస్తున్నట్లు క్రీడా వర్గాలు తెలిపాయి. 'ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా, భారత్ హెడ్ కోచ్ గంభీర్ ఇంగ్లాండ్ టూర్ నుంచి భారత్?కు తిరిగి వచ్చేస్తున్నాడు' అని క్రీడా వర్గాలు మీడియాకు వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం అతడు సిరీస్ ముగిసే దాకా అక్కడే ఉండాలి. కానీ, వ్యక్తిగత కారణాల వల్ల ఇంతలోనే గంభీర్ తిరుగు ప్రయాణం అయ్యాడు. అయితే రోహిత్, విరాట్ రిటైర్మెంట్ అవ్వడం వల్ల సీనియర్లు లేకుండానే యువ కెప్టెన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో గంభీర్ కూడా తిరిగి వస్తుండడం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపే ఛాన్స్ ఉంది. భారత టెస్టు జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు : షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్సే, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జామీ ఓవర్‌టన్, ఆలీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్), బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోష్ టోక్స్, క్రిస్

ఓటమికి ఒకర్ని నిందించను: శ్రేయస్ అయ్యర్

ముంబై టీ20 ప్రీమియర్ లీగ్ ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించిన సోబో ముంబై ఫాల్కన్స్ ఓటమిపాలైంది. 9 రోజుల వ్యవధిలోనే కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ రెండు ఫైనల్ మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూశాడు. ఈ నెల 3న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన ఐపీఎల్ 2025 ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ నడిపించిన పంజాబ్ కింగ్స్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఇక గురువారం జరిగిన ముంబై ప్రీమియర్ టీ20 లీగ్ ఫైనల్లో ముంబై సౌత్ సెంట్రల్ మరాఠ రాయల్స్ చేతిలో శ్రేయస్ నడిపించిన ముంబై ఫాల్కన్స్ జట్టు ఓటమిపాలైంది. ఈ రెండు ఫైనల్లోనూ శ్రేయస్ అయ్యర్ బ్యాటర్‌గా విఫలమయ్యాడు. టీ20 ఫార్మాట్‌లో అద్భుతమైన కెప్టెన్‌గా ప్రశంసలు అందుకుంటున్న అయ్యర్.. కీలక మ్యాచ్‌ల్లో బ్యాట్‌తో రాణించలేక విమర్శల పాలవుతున్నాడు. తాజా ఫైనల్లో శ్రేయస్ అయ్యర్(17 బంతుల్లో 12) వైఫల్యంతో ముంబై ఫాల్కన్స్ జట్టు 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. వాంఖడే వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఫాల్కన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులే చేసింది. అనంతరం ముంబై సౌత్ సెంట్రల్ మరాఠ రాయల్స్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసి గెలుపొందింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసిందన్నాడు. అయితే ఈ ఓటమికి జట్టులో ఏ ఒక్కర్ని నిందించలేనని స్పష్టం చేశాడు. 'ఈ ఓటమికి ఒకర్ని నిందిస్తూ.. ఓ ప్రత్యేకమైన సంఘటన కారణమని నేను చెప్పాలనుకోవడం లేదు. ఓవరాల్‌గా మా జట్టు ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. ఫైనల్‌కు చేరే క్రమంలో మేం ఒక్క మ్యాచ్ కూడా ఓడలేదు. ఫైనల్లోనే ఓటమిపాలయ్యాం. ఈ టోర్నీ మేం ఓడించి ఒకే ఒక్క మ్యాచ్. కాబట్టి ఈ ఓటమికి నేను ఎవర్నీ నిందించలేను. అలా చేస్తే ఓ ఆటగాడికి వెన్నుపోటు పొడిచినట్లు అవుతుంది. అలా చేయడం నాకు ఇష్టం ఉండదు. ఫైనల్లో ఓడిన తర్వాత నిరాశకు గురవ్వడం సర్వసాధారణం. ఈ ఓటమి మా ఆటగాళ్లకు బాధ కలిగించి ఉంటుంది. కానీ వచ్చే ఏడాదికి ఈ ఓటమి అదనపు ప్రేరణగా.. ఆత్మవిశ్వాసంగా మారుతుంది. మా కుర్రాళ్లు వారి ప్రదర్శన పట్ల గర్వపడాలి. వరుసగా రెండు ఫైనల్లో ఓడిపోవడం బాధగానే ఉంది.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.

అందరి దృష్టి భారత బ్యాటింగ్ లైనప్ పైనే..

ఇంగ్లాండ్ తో 20 నుంచి లీడ్స్ లో తొలి టెస్టు

ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ 2025–27 సైకిల్ ను ఈసారి విదేశాల్లో భారత్ ప్రారంభించబోతోంది. ఐదు టెస్టుల సిరీస్ తో ప్రతిష్టాత్మక పోరును మొదలు పెట్టనుంది. ఇంగ్లాండ్ తో ఈనెల 20 నుంచి లీడ్స్ మైదానంలో జరిగే తొలి టెస్టు ద్వారా చాలెంజింగ్ టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. ఇక ఈ సారి దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండానే టీమిండియా ఈ టూర్ చేస్తోంది. పేపర్ పై అంత అనుభవం లేకుండా కనిపిస్తున్న భారత జట్టులో ప్రతిభకు కొదువలేదు. ఇప్పటికే దేశవాళీతోపాటు వివిధర రకాల ఎన్నో మ్యాచ్ ల్లో రాణించిన అనుభవం భారత్ సొంతం. అయితే ఈ సిరీస్ లో అందరి దృష్టి భారత బ్యాటింగ్ లైనప్ పైనే ఉంది. సరికొత్తగా ప్రారంభం కాబోతున్న ఈ లైనప్ లో ఎవరెవరు ఆడాలో, ఇప్పటికే పలువురు దిగ్గజాలు సూచనలు చేశారు. తాజాగా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప.. ఇంగ్లాండ్ లో బరిలోకి దిగబోయే భారత బ్యాటింగ్ లైనప్ పై వ్యాఖ్యానించాడు. ఒక ఓపెనర్ గా యశస్వి జైస్వాల్ ఖాయం కాగా, ప్రస్తుత టూర్లో సత్తా చాటిన సీనియర్ బ్యాటర్ లోకేశ్ రాహుల్ ను జైస్వాల్ కు తోడుగా ఓపెనింగ్ చేయించాలని సూచిస్తున్నాడు. ప్రస్తుత టూర్లో ప్రాక్టీస్ మ్యాచ్ ల్లో ఒక సెంచరీ, ఫిఫ్టీతో సత్తా చాటాడు. అలాగే గతంలో ఇంగ్లాండ్ తోపాటు ఆసీస్ లోనూ రాణించిన అనుభవం అతని సొంతమని చెప్పాడు. ఇక నెంబర్ త్రీలో ఐపీఎల్లో విశేషంగా రాణించిన సాయి సుదర్శన్ ను తీసుకోవాలని సూచిస్తున్నాడు. దీంతో టాప్ త్రీ బలంగా ఉంటుందని పేర్కొన్నాడు. ఇక నాలుగో నెంబర్లో కెప్టెన్ శుభమాన్ గిల్, ఐదో స్థానంలో అనుభవం గల కరుణ్ నాయర్ ను ఆడించాలని సూచించాడు. అప్పుడే బ్యాటింగ్ లో స్థిరత్వం ఉంటుందని పేర్కొన్నాడు. ఇక ఆరో నెంబర్లో డాషింగ్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ను బరిలోకి దించాలని పేర్కొన్నాడు. ఇక ఏడో స్థానంలో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిని ఆడించాలని సూచించాడు. పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ గా ఆడిస్తే, అటు నాలుగో పేసర్ గానూ, ఇటు బ్యాటింగ్ లోనూ డెప్త్ ఉంటుందని పేర్కొన్నాడు. ఎనిమిదో స్థానంలో వెటరన్ స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను ఆడించాలని సూచించాడు. దీంతో కుల్దీప్ యాదవ్ ను పక్కన పెట్టాలని పేర్కొన్నాడు. ఇక పేస్ బాధ్యతలను జస్ ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణలకు అప్పగించాలని, వీరికి తోడుగా నాలుగో పేసర్ గా నితీశ్ ఉంటాడని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ పరిస్థితులకు ఇదే బెస్ట్ బ్యాటింగ్ లైనప్ అని విశ్వాసం వ్యక్తం చేశాడు. తాజా లైనప్ తో జట్టు సమతూకంతో ఉందని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా అటు కోచ్ గౌతం గంభీర్, ఇటు కెప్టెన్ గిల్ ఆలోచలకు తగిన ప్లేయింగ్ లెవన్ ఏ విధంగా ఉంటుందో తెలియాలంటే మరో వారం రోజులు ఆగక తప్పని పరిస్థితి నెలకొంది.

'హ్యాండిల్డ్ ది బాల్' వివాదం!

ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో భాగంగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ఫైనల్లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. 'హ్యాండిల్డ్ ది బాల్' వివాదం తీవ్ర చర్చనీయాంశమైంది. సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ బెడింగ్‌హామ్ తన ప్యాడ్‌లో ఇరుక్కున్న బంతిని చేత్తో కిందపడేయడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఔటంటే.. మరికొందరు నాటౌట్ అని కామెంట్ చేస్తున్నారు. గురువారమైన రెండో రోజు ఆటలో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ సందర్భంగా బ్యూ వెబ్‌స్టర్ వేసిన 49వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ మూడో బంతిని వెబ్‌స్టర్ ఆఫ్ స్టంప్ లైన్‌లో వేయగా.. బెడింగ్‌హమ్ డిఫెన్స్ చేసే ప్రయత్నం చేశాడు. కానీ ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్న బంతి బెడింగ్‌హమ్ ప్యాడ్‌లో ఇరుక్కుంది. ఆ బంతి కిందికి వచ్చే అవకాశం ఉండటంతో ఆసీస్ వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ క్యాచ్ కోసం ప్రయత్నించాడు. కానీ బెడింగ్‌హమ్ బంతిని చేత్తో తీసి కిందపడేసాడు. దాంతో ఆసీస్ ఆటగాళ్లు 'హ్యాండిల్డ్ ది బాల్' గురించి అప్పీల్ చేశారు. అయితే అంపైర్లు నాటౌట్‌గా ఇచ్చారు. అప్పటికే బంతి డెడ్ బాల్ అయిందని స్పష్టం చేశారు. క్రికెట్ నియమాల ప్రకారం బంతి బ్యాటర్ ప్యాడ్లలో లేదా దుస్తుల్లో ఇరుక్కుంటే డెడ్ బాల్‌గా పరిగణిస్తారు. బ్యాటర్ పట్టుకున్నా నాటౌట్‌గానే ఇస్తారు. అయితే రిప్లేలో బంతి కిందపడేసే క్రమంలో బెడింగ్‌హమ్ బంతిని పట్టుకోవడం వివాదమైంది. బంతి డెడ్ అయినప్పుడు కాకుండా కదులుతూ ఉన్న సమయంలో పట్టుకున్నాడని, ఔటేనని కొంతమంది వాదిస్తున్నారు. బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా చేతితో బంతిని అడ్డుకుంటే హ్యాండిల్డ్ ది బాల్ రూల్ కింద ఔటిస్తారు. బ్యాటర్ బంతి వికెట్ల వైపు వెళ్లకుండా అడ్డుకోవడం లేదా ఫీల్డర్ క్యాచ్ పట్టకుండా చేస్తే ఈ రూల్ కింద ఔట్ ఇస్తారు. బ్యాటర్ తన శరీరాన్ని గాయం నుంచి రక్షించుకోవడానికి బంతిని చేతితో తాకితే మాత్రం ఔటివ్వకుండా మినహాయింపు ఇస్తారు. గతంలో 'హ్యాండిల్డ్ ది బాల్' అనేది క్రికెట్ నిబంధనల్లో ఒక ప్రత్యేకమైన ఔట్(లా 33) పద్ధతిగా ఉండేది. 2017లో %వీజజ% (మేరిల్‌బోన్ క్రికెట్ క్లబ్) ఈ రూల్‌ను సవరించింది. ఈ రూల్‌ను అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్(లా 37) అనే నియమంలో విలీనం చేసింది. ఈ రూల్ ప్రకారం బంగ్లాదేశ్ ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ ఒక మ్యాచ్‌లో ఔటయ్యాడు. బౌలర్ వేసిన బంతిని డిఫెండ్ చేసిన తర్వాత, అది వికెట్ల వైపు వెళ్లకుండా అతను చేతితో అడ్డుకున్నాడు.

విశ్వజ



ప్రతీ దానికి టెన్షన్ పడుతున్నారా? అయితే ఈ జబ్బులు గ్యారెంటీ

టెన్షన్.. ఇప్పుడు చాలామంది జీవితాల్లో దీనిని తగ్గించడం కష్టంగా మారిపోయింది. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన పని ఒత్తిడి వెరసి టెన్షన్ అందరి జీవితాల్లోనూ భాగంగా మారింది. ఇక బాగా టెన్షన్ పడితే అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ టెన్షన్‌ను తగ్గించుకోవాలని ప్రశాంతంగా బ్రతకడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. టెన్షన్‌తో హైబీపీ టెన్షన్ తో చేయాల్సిన పనులు సరిగ్గా చేయకపోగా, అనవసరమైన రిస్కులు పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. బాగా టెన్షన్ పడితే హైబీపీ వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. హైబీపీ మన శరీరంలోని ధమనుల గోడల పైన ఒత్తిడిని పెంచి మనకు గుండెపోటు, మరియు మూత్రపిండాల వ్యాధులు రావడానికి కారణమవుతుందని అందుకే టెన్షన్‌ను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. టెన్షన్ తో గుండెజబ్బులు, మధుమేహం టెన్షన్ ఎక్కువగా ఉన్నవారిలో గుండె పనితీరు దెబ్బతింటుంది. ఇది గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. బాగా టెన్షన్ పడే వారిలో దయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. విపరీతమైన ఒత్తిడి ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతుంది. దీనివల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. టెన్షన్ తో జీర్ణ సమస్యలు, నిద్రలేమి టెన్షన్ జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దీంతో అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. విపరీతమైన టెన్షన్ తలనొప్పికి కూడా కారణమవుతుంది. టెన్షన్ కారణంగా నిద్ర స్థాయి కూడా తగ్గుతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యం పైన ప్రతికూల ప్రభావం పడుతుంది. రోగ నిరోధక శక్తి పెంచుకోవాలంటే ఇవి తినండి! టెన్షన్ తో మానసిక, శారీరక సమస్యలు ఇక ఎక్కువ కాలం పాటు టెన్షన్ పడుతూ ఉండడం ఒక రకమైన ఆందోళనకు, డిప్రెషన్ కు కారణమవుతుంది. మానసిక రుగ్మతలకు కారణంగా మారుతుంది. ఎన్నో అనర్థాలు కలిగించే టెన్షన్ ను పక్కన పెట్టి ప్రశాంతంగా జీవించడం ఉత్తమం. ప్రశాంతంగా ఉన్న వారికి ఎటువంటి రోగాలు వచ్చే అవకాశం లేదు. అందుకీ టెన్షన్ తగ్గించుకోవటానికి యోగా, మెడిటేషన్ వంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

మామిడిపండు తిన్న తర్వాత ఇవి తినొద్దు,

ఈ పనులు అసలే చెయ్యొద్దు!

సమ్మర్ సీజన్లో అందరికీ ఇష్టమయ్యే పండ్ల రారాజు మామిడిపండు ఇప్పటికే మార్కెట్లోకి వచ్చింది. మామిడి పండ్లను చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. మామిడి పండ్లు తినాలని అనుకోని వారు ఎవరు ఉండరు. మామిడిపండు రుచికి మాత్రమే కాదు, బోలెడన్ని పోషకాలతో మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయి. మామిడి పండ్లలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఏ, ఫైబర్, ఆంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మామిడి పండ్లు తింటున్నారా? అంతేకాదు మన జీర్ణక్రియను మెరుగుపరిచే, పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహించే ఎంజైములు కూడా మామిడి పండ్లలో పుష్కలంగా ఉంటాయి. ఇక అటువంటి మామిడి పండ్లను తింటున్న వారు మామిడి పండ్లు తిన్న తర్వాత కొన్ని ఆహార పదార్థాలను తినకుండా ఉంటేనే మంచిది. ఒకవేళ పొరపాటున తింటే అనవసరమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. మామిడి పండ్లు తిన్నాక ఇవి అసలే తినొద్దు మామిడిపండు తిన్న తర్వాత కొన్ని రకాల ఆహార పదార్థాలను తినకూడదు. మామిడి పండ్లతో పాల పదార్థాలను తీసుకోకుండా ఉంటేనే మంచిది. పాలు, పెరుగు, మజ్జిగ, శీతల పానీయాలు, మామిడి స్మూతీలు వంటివి తీసుకోకూడదు. మామిడి పండ్లను తిన్న తర్వాత వీటిని తీసుకుంటే జీర్ణక్రియకు ఆటంకం కలుగుతుంది. ఇవి జీర్ణక్రియను నిదానింపజేసి జీర్ణ సంబంధిత సమస్యలకు కారణమవుతాయి. ఇక మామిడి పండ్లను తినేవారు మామిడి పండ్లతో చీజ్ తినడం మంచిది కాదు. మామిడి పండు తిన్న తర్వాత ఇవి చేస్తే అనారోగ్య సమస్యలు మామిడిపండు తిన్న తర్వాత బాగా వేడిగా ఉండే ఆహారాన్ని కానీ మసాలాతో చేసిన ఆహారాన్ని కానీ తినకూడదు. మామిడిపండు తిన్న తర్వాత మళ్లీ ఇతర పండ్లను తినడం వల్ల జీర్ణ సమస్యలు గ్యాస్ లేదా అజీర్ణ సమస్యలు వస్తాయి. ఇక మామిడిపండు తిన్న తర్వాత వెంటనే నిద్రపోతే కూడా జీర్ణక్రియలో ఇబ్బందులు వస్తాయి. తిన్న తర్వాత నిద్రకు ముందు ఒక అరగంట సమయమైనా గ్యాప్ ఉండాలి. రోగ నిరోధక శక్తి పెంచుకోవాలంటే ఇవి తినండి! మామిడి పండు తిన్నాక అనారోగ్య బారిన పడకుండా ఇవి చెయ్యండి ఇక మామిడిపండు తిన్న తర్వాత 30 నిమిషాల నుండి ఒక గంట వరకు కొన్ని పనులు చేయకుండా ఉంటేనే మంచిది. మామిడి పండు తిన్న తర్వాత బరువులు ఎత్తడం, శారీరక వ్యాయామాలు చేయడం వంటిది మంచిది కాదు. ఇక మామిడి పండు తినాలి అనుకునేవారు చేయకూడని పనులు, మామిడి పండు తిన్న తర్వాత తినకూడని పదార్థాలను ఖచ్చితంగా తెలుసుకుంటే అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

తీపి తిన్నా నో టెన్షన్..ఈ 7 డ్రై ఫ్రూట్స్ తింటే షుగర్ పెరగదు!

ప్రస్తుతం భారతదేశంలో చాలామందిని వేధిస్తున్న అతిపెద్ద సమస్య డయాబెటిస్. దీనిని షుగర్ వ్యాధి అని, మధుమేహం అని కూడా అంటారు. ప్రస్తుతం మనదేశంలో దాదాపు 9 కోట్లమంది షుగర్ పేషెంట్లు ఉన్నారు. అందుకే మనదేశాన్ని వరల్డ్ డయాబెటిస్ క్యాపిటల్ అని కూడా పిలుస్తుంటారు. అయితే మీరు కూడా డయాబెటిస్ లేదా ప్రీ-డయాబెటిస్‌తో బాధపడుతున్నారా? రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడం మీకు పెద్ద సవాలుగా ఉందా? తీపి పదార్థాలు అంటేనే భయపడుతున్నారా? అయితే మీకో గుడ్ న్యూస్. కొన్ని డ్రై ఫ్రూట్స్ రక్తంలో షుగర్ లెవల్స్ ని స్థిరీకరించడంలో సహాయపడతాయి. చాలా డ్రై ఫ్రూట్స్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. వీటిని తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా, స్థిరంగా పెరుగుతాయి. సరైన మోతాదులో తీసుకుంటే, ఆరోగ్యకరమైన ఆహారంతో కలిపి తింటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ తెలిపిన ప్రకారం.. గింజలు, విత్తనాలు వంటి ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను మీ డైట్ లో చేర్చుకోవడం వల్ల గ్లైసెమిక్ నియంత్రణలో గణనీయమైన మెరుగుదల ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచడానికి సహాయపడే ఆ అద్భుతమైన డ్రై ఫ్రూట్స్ ఏవో ఇక్కడ చూడండి. రక్తంలో షుగర్ లెవల్స్ ని తగ్గించే డ్రై ఫ్రూట్స్ పిస్తా వాస్తవానికి పిస్తాపప్పులను రెగ్యులర్ గా తినడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ తగ్గుతాయని అనేక పరిశోధనల్లో తేలింది. సమతుల్య ఆహారంలో పిస్తాపప్పులను చేర్చుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ తగ్గుతుందని, ఇన్సులిన్ స్థాయిలు మెరుగుపడతాయని ఓ అధ్యయనంలో తేలింది. వాల్ నట్స్ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే వాల్ నట్స్.. ఇన్సులిన్ నిరోధకతకు ప్రధాన కారణమైన వాపును తగ్గిస్తాయి. వీటి కూడా

తక్కువగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ ఇవి ముందుంటాయి, ఇది షుగర్ వ్యాధి ఉన్నవారికి చాలా ముఖ్యం. మహిళలకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఏ వయస్సులో ఎక్కువ ఉంటుందో తెలుసా? ఎండుద్రాక్ష ఎండుద్రాక్షలో సహజ చక్కెరలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిలో ఫైబర్, ఫైటోకెమికల్స్ ఉంటాయి. ఇవి గ్లూకోజ్ జీవక్రియకు సపోర్ట్ చేస్తాయి. పరిశోధనల ప్రకారం ఎండుద్రాక్షలను మితంగా తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు గణనీయంగా పెరగవు. బాదం బాదంలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, ఫైబర్ మాత్రం పుష్కలంగా ఉంటాయి. పలు అధ్యయనాల ప్రకారం బాదంపప్పు.. భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరగకుండా అడ్డుకుంటుంది. అంతేకాకుండా బాదంని దీర్ఘకాలికంగా తీసుకుంటే ఇన్సులిన్ సెన్సిటివిటీ కూడా మెరుగుపడుతుందని అధ్యయనాల్లో తేలింది. షుగర్ వ్యాధి ఉన్నవారికి చాలా ముఖ్యం. జీడిపప్పు ఇతర గింజలతో పోలిస్తే జీడిపప్పులో కొంచెం ఎక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్నప్పటికీ..వీటిలో ఉండే మెగ్నీషియం, మోనోశాచురేటెడ్ కొవ్వులు మితంగా తీసుకుంటే రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడతాయి. కాబట్టి జీడిపప్పుని కొద్దిగానే తినాలి. ఎవరినైనా టచ్ చేస్తే 'టక్కు' మని షాక్ కొడుతుందా? అసలు రహస్యం ఇదే ఖర్జూరం సాధారణంగా ఖర్జూరాలు తీపిగా ఉంటాయి కానీ వాటి మీడియంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒకసారికి 1-2 ఖర్జూరాలు వంటి చిన్న మొత్తంలో తింటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా శక్తిని, పోషకాలను అందిస్తాయి. వీటిని గింజలతో కలిపి తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది. అంజీర్ ఎండిన అంజీర్ పండ్లు ఫైబర్ గొప్ప మూలం. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచే సహజ సమ్మేళనాలు కూడా ఉంటాయి. వీటిని కూడా తక్కువగానే తినాలి. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 1-2 ముక్కలు తీసుకోవడం సురక్షితం అని నిపుణులు చెబుతున్నారు.

మార్కెట్

గోల్డ్ రివర్స్‌గేర్.. దిగివస్తున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ : బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. ఒకవైపు వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమవుతుండటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కితీసుకుంటుండటంతో ఈక్విటీలతోపాటు అతి విలువైన లోహాలు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంట్లోభాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో పదిగ్రాముల బంగారం ధర రూ.1,050 తగ్గింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.91,250కి దిగొచ్చింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే తగ్గి రూ.89,750కి దిగొచ్చింది. పసిడితోపాటు వెండి ధరలు కూడా తగ్గాయి. కిలో వెండి రూ.500 తగ్గి రూ.93,200కి దిగొచ్చింది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 61.98 డాలర్లు ఎగబాకి 3,044.14 డాలర్లకు ఎగబాకగా, వెండి 2 శాతం అధికమై 30.41 డాలర్లకు చేరుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం మరింత ముదురుతుండటంతో పెట్టుబడిదారులు వేచి చూసేధోరణి అవలంభిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. మరోవైపు, యూఎస్ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ విడుదల చేయబోయే మినిట్స్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై విశ్లేషకులు దృష్టి సారించారని చెప్పారు.

గృహ, వాహన రుణాలు చౌక..

అన్నిరకాల లోన్లపై తగ్గనున్న ఈఎంఐ భారం!

మరింత దిగొచ్చిన కీలక వడ్డీరేట్లు

రెపోరేటు పావుశాతం తగ్గి 6 శాతానికి

వృద్ధిరేటు అంచనా డౌన్.. ఈసారి 6.5%

ముంబై : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లను తగ్గించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను చేపట్టిన తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును మరో పావుశాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టినట్టు బుధవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో 6.25 శాతం నుంచి 6 శాతానికి వచ్చింది. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును తొలిసారి పావుశాతం (6.5 శాతం నుంచి 6.25 శాతానికి) తగ్గించిన విషయం తెలిసిందే. 2020 మే తర్వాత ఈ ఫిబ్రవరిలోనే తగ్గించారు. ఈ క్రమంలో తాజా తగ్గింపు అరశాతానికి చేర్చగా.. గృహ, వాహన, వ్యక్తిగత రుణగ్రహీతలకు మరింత లబ్ధి చేకూర్చినైట్టెంది. ఈఎంఐల భారం ఇంకొంత దిగనున్నది మరి.

మున్ముందు మరిన్ని కోతలు

ఆర్బీఐ తమ ద్రవ్యవిధాన వైఖరిని 'న్యూట్రల్' నుంచి 'ఎకామ్డేటివ్'కు మార్చుకున్నది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు స్థిరంగా లేదా తగ్గడమో జరుగనున్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు 3 రోజులపాటు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా నేతృత్వంలో జరిగిన ద్రవ్యసమీక్షలో ఎంపీసీలోని మొత్తం ఆరుగురు సభ్యులూ రెపోరేటు తగ్గింపునకే ఓటేశారు. ఫలితంగా రెపోరేటుకు అనుసంధానమైన అన్ని ఈబీఎల్ఆర్ దిగిరానున్నాయి. రుణాల ఈఎంఐల భారం కూడా తగ్గనున్నదని బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి.

పీ2ఎం పేమెంట్స్‌కు జోష్..

పర్సన్-టు-మర్చంట్ పేమెంట్స్ (పీ2ఎం) కోసం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)లో లావాదేవీల పరిమితిని పెంచేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆర్బీఐ అనుమతిచ్చింది. ప్రస్తుతం పీ2ఎంతోపాటు పర్సన్-టు-పర్సన్ (పీ2పీ) పేమెంట్స్‌కు యూపీఐ ద్వారా లక్ష రూపాయల లావాదేవీకే అనుమతి ఉన్నది. అయితే కొన్ని సందర్భాల్లో పీ2ఎం పేమెంట్స్‌ను రూ.2 లక్షలు, రూ.5 లక్షలదాకా చేసుకోవచ్చు.

4 శాతంగా ద్రవ్యోల్బణం

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యోల్బణం 4 శాతానికి దిగిరావచ్చన్న ఆశాభావాన్ని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. మునుపు దీన్ని 4.2 శాతంగా అంచనా వేసిన విషయం తెలిసిందే. దేశంలో వ్యవసాయోత్పత్తి బాగుందని, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయన్న ఆయన పరిస్థితులు ఇలాగే ఉంటే అన్నింటి ధరలు కూడా తగ్గుతాయన్న విశ్వాసాన్ని కనబర్చారు. కూరగాయల ధరలు దిద్దుబాటుకు లోనవుతుండటంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 21 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.8 శాతానికి చేరిన సంగతి విదితమే. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం గణాంకాలు సైతం కిందకొస్తున్నాయి.

వృద్ధి అంచనాకు కత్తెర

దేశ జీడీపీ వృద్ధిరేటుకు ఆర్బీఐ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) 6.5 శాతానికే పరిమితం కావచ్చని అంచనా వేసింది. మునుపు ఇది 6.7 శాతం గా ఉండటం విశేషం. అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, విధానాల్లో అనిశ్చితి వల్లే ఆర్థిక వృద్ధి 0.2 శాతం మేర తగ్గవచ్చని అంచనా వేసినట్టు మల్హోత్రా తెలిపారు. వ్యవసాయ రంగం ఆశాజనకంగా కనిపిస్తున్నదని, తయారీ రంగం కోలుకుంటున్న సంకేతాలున్నాయని, సేవా రంగం స్థితిస్థాపకతను ప్రదర్శిస్తున్నదని చెప్తూనే.. టారిఫ్ వార్ దెబ్బకు భారతీయ వాణిజ్య ఎగుమతులు పడిపోవచ్చన్న ఆందోళనను వెలిబుచ్చారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందికరమేనని హెచ్చరించడం గమనార్హం. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంగా దేశ ఆర్థిక వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చన్న మల్హోత్రా.. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.5 శాతం, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో 6.7 శాతం, మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 6.6 శాతం, నాల్గో త్రైమాసికం (జనవరి-మార్చి)లో 6.3 శాతంగా అంచనా వేశారు.

ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

విజయవాడ, అక్టోబరు 9 : ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది. ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ (కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిది ఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం. జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజిక వర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ-వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంత మేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లను చీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి. ఏపీలో కొత్త పార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధుల నిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్క శాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.



ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

నెల్లూరు : పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసిన పిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహం నడుస్తోందా? ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఉ.నా.ఓబ.ఔనీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది. వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైన పరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టు అడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలని చూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరి నాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయ పరీక్షగా మారాయి. స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021-26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ. 10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ. 10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ. 12,000 కోట్ల “పే కమిషన్ నిధులు” ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది. బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతం కోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణ స్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడా ఇవ్వనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీ రిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది? కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

సుప్రీం కోర్టు తీర్పు - స్థానిక ఎన్నికలకు షెడ్యూల్..

స్థానిక ఎన్నికల షెడ్యూల్ కు ముహూర్తం ఫిక్స్ అయింది. సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్ల పైన నిర్ణయం వెలువడింది. హైకోర్టు తీర్పునే సుప్రీం సమర్థించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను తిరస్కరించింది. ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో.. షెడ్యూల్ ప్రకటించేలా ఎన్నికల సంఘం తుది కసరత్తు చేస్తోంది. రిజర్వేషన్ల పైన అంచనాలు సిద్దం అయినట్లు తెలుస్తోంది. దీంతో.. రాష్ట్రంలో ఎన్నికల సమరం మొదలు కానుంది. బీసీ రిజర్వేషన్ల పై సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది. 34 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు... రిజర్వేషన్లు 50 శాతం మించరాదని తేల్చి చెప్పింది. ఎన్నికల నిర్వహణ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టు నిర్దేశించిన గడువు లోగా ఎన్నికలు నిర్వహించేలా సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. దీంతో...స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు సహచర మంత్రులకు సీఎం చంద్రబాబు సైతం స్పష్టం చేశారు. ఈ రోజు (శుక్రవారం) సాయంత్రం లేదా 12వ తేదీన నోటిఫికేషన్ రావడం ఖాయమని మంత్రివర్గ భేటీలోనే వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, కూటమి ఐక్యతకు భంగం కలిగించకుండా వ్యవహరించాలని ఆదేశించారు. పట్టణ స్థానిక సంస్థలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. కాగా, స్థానిక ఎన్నికల ప్రక్రియ నవంబరు నెలాఖరుకు ముగుస్తుందని తెలిపారు. దీంతో.. నవంబర్ ద్వితీయార్ధంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. కాగా, ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల పైన పూర్తి సమాయత్తం అవుతోంది. ఎన్నికల ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ దిశా నిర్దేశం చేసింది. ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై కమిషన్ అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణపై ఈ సమావేశంలో జిల్లా యంత్రాంగానికి ఎస్ఈసీ కీలక ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేసింది.

34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

రాజమండ్రి అక్టోబరు 9 : ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్దతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది. అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలం వెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది. చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీ టికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేవడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం

విజయవాడ : నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం మల్లికార్జున పేట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు. సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు. నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం ‘డ్రై డే’గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యామ్, హెల్త్ సూపర్ వైజర్స్ సిహెచ్ పిచ్చేశ్వరరావు, శివ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఢిల్లీలో పటిష్ట బందోబస్తు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వరుస అందోళనలు జరుగుతున్న నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేసారు. నాలుగు రోజులుగా ఇండియా కూటమి ఆందోళనలతో నగరం స్తంభిస్తుంది. శనివారం జంతర్ మంతర్ లో సిజెపి , వామపక్ష విద్యార్థి సంఘాలనిరసన జరగనుంది. ఇండియా కూటమి, సిజెపి, వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళనల నేపథ్యంలో వేలాది భద్రతా బలగాల మోహరింపు సిద్దం చేసారు. శనివారం ఢిల్లీలోకి దాదాపు 50 వేల మంది ప్రవేశించే అవకాశం ఉందని సెంట్రల్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. దాంతో ఢిల్లీ పోలీసులకు అదనంగా దాదాపు 26 వేల మంది సాయుధ బలగాల మోహరింపు సిద్దం చేసారు. బెంగాల్, చత్తీస్గడ్ నుంచి వెంటనే ఢిల్లీకి వెళ్లేలా 7000 మంది సీఆర్పీఎఫ్ బలగాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు ఇచ్చింది. జంతర్ మంతర్ సహా మధ్య ఢిల్లీలోని సమస్య త్మక ప్రాంతాల్లోకి ఎవరిని అనుమతించేది లేదని పోలీసులు అంటున్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే అన్ని సరిహద్దు మార్గాల్లోనూ చెక్పోస్టుల ఏర్పాటు చేసారు. 12వ తేదీ వరకు దాదాపు 26 వేల మంది సాయి దళాల సిబ్బంది ఢిల్లీ పోలీసులకు అదనంగా ఇప్పటికే ఢిల్లీలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 5,000 మంది వెల్లి పోలీస్ సిబ్బంది పహారా నిర్వహిస్తున్నారు. జంతర్ మంతర్ పార్లమెంటు వైపు వెళ్లే అన్ని మార్గాల్లోనూ మల్టీ లేయర్ బారికేట్స్ ఏర్పాటు చేసారు. సెంట్రల్ ఢిల్లీలోని మద్యం దుకాణాలన్నింటినీ మూసివేసేయాల్సిందిగా ఢిల్లీ ఎక్సైజ్ శాఖకు పోలీసులు లేఖ రాసారు.

ఎరుపు రంగులోకి భుగోళం.. సూపర్ డూపర్ ఎలినినో

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన ఎల్ నినో క్రమంగా తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే దీని ప్రభావంతో భారత్ సహ దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని ఇటీవల ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజాగా, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ.. సూపర్ ఎల్ నినో దెబ్బకు భూగోళం మొత్తం ఎరుపుగా మారిపోయిందని మ్యాప్‌ను షేర్ చేశారు. గతంలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకుంటోన్న ఎల్ నినో ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1950 తర్వాత నమోదుకాబోతున్న అత్యంత బలమైన వాతావరణ పరిణామాలలో ఇది ఒకటి కావచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల తీవ్రతను ఈ ఎల్ నినో మరింత పెంచుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రం అంతర్భాగంలో దాగివున్న అధిక ఉష్ణోగ్రతలను బయటకు విడుదల చేయడం వల్ల భూగోళంలో అత్యధిక భాగం అసాధారణమైన వేడిని ఎదుర్కొంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రియాన్ మౌ అనే అంతర్జాతీయ వాతావరణ నిపుణుడు మొత్తం భూగోళానికి సంబంధించిన క్లైమేట్ మ్యాప్‌ను సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో పంచుకుంటూ... భూగోళం అంతా దాదాపుగా ఎరుపు రంగులోకి (తీవ్రమైన వేడికి సూచికగా) మారిపోయిందని పేర్కొన్నారు. “అమెరికా మినహా మిగిలిన ప్రపంచమంతటా ఉష్ణోగ్రతలను విపరీతంగా పెంచుతూ ఈ ఎల్ నినో శీతాకాలంలో కూడా తన ‘గరిష్ట ప్రతాపాన్ని’ చూపిస్తోంది” అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఎల్ నినో తీవ్రత వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న చిటూ అంచనాతో ఆయన కూడా ఏకీభవించారు. మరో శాస్త్రవేత్త జీకే హాస్‌ఫాధర్ స్పందిస్తూ... “ఈ ఏడాది ఎల్ నినో రికార్డులను తిరగరాస్తూ కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది.. నినో 3.4 ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి. ఇది ఇప్పటివరకు నమోదైన ఏ ఇతర ఎల్ నినో పరిణామం కంటే కూడా అత్యధికం” అని పేర్కొన్నారు. లియోన్ సిమన్స్ అనే మరో నిపుణుడు ఈ పరిణామాన్ని ‘సూపర్-డూపర్ ఎల్ నినో’ గా అభివర్ణించారు. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని ఎక్కువ భాగంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఎల్ నినో పుట్టకకు కేంద్రమైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. సాధారణంగా ఎల్ నినో అనేది సహజంగా సంభవించే ‘ఎల్ నినో-సౌత్ ఐసోలేషన్’ చక్రంలో భాగమైన ఒక వేడి దశ. ఇది ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఈ వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, వర్షపాత వ్యవస్థలు దెబ్బతింటాయి. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరువు కాటకాలు, మరికొన్ని ప్రాంతాల్లో తుఫానులు, భారీ వర్షాలు సంభవిస్తాయి. ఈ అసాధారణ పరిస్థితుల వల్ల ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన ఈదురుగాలులు, తీరప్రాంత వరదలు, బీచ్ కోత ప్రమాదాలు చాలా ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించిన కాలిఫోర్నియా గవర్నర్ గెవిన్ న్యూసమ్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, శీతాకాలపు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గత నెలలోనే రాష్ట్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. సమీప కాలంలో ద్రవ్యోల్బణంపై సరఫరా వైపు నుంచి ఒత్తిళ్లు కొనసాగొచ్చని ఆర్బీఐ తెలిపింది. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో పరిస్థితులు, అంతర్జాతీయ చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు దీనికి కారణమవుతాయని పేర్కొంది. చమురును మినహాయిస్తే ఆహార విభాగంలోని పలు కమోడిటీల ధరల్లో కూడా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. కోర్ ద్రవ్యోల్బణం పెరగడం, సీపీఐ బాస్కెట్‌లోని మరిన్ని వస్తువుల ధరలు పెరగడం చూస్తే ద్రవ్యోల్బణం ఒకటి రెండు వస్తువులకు పరిమితం కాకుండా విస్తృతంగా మారే తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని ఆర్బీఐ తెలిపింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 2026-27లో సీపీఐ ద్రవ్యోల్బణం 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. రెండో త్రైమాసికంలో 4.9 శాతం, మూడో త్రైమాసికంలో 6.0 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. 2027-28 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. దీనికి సంబంధించిన రిస్కులు కూడా ఇరువైపులా సమానంగా ఉన్నాయని పేర్కొంది. 2026-27 మొత్తం సంవత్సరానికి కోర్ ద్రవ్యోల్బణం 4.4 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది. అమెరికాలోని ఆరు రాష్ట్రాలు ఈ శీతాకాలంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం, భారీ హిమపాతాన్ని ఎదుర్కోనున్నాయి. కాలిఫోర్నియాతో పాటు నెవాడా, ఉతా, కొలరాడో, న్యూ మెక్సికో, అరిజోనా రాష్ట్రాలపై ఈ ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని పర్వత ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల్లో సగటు కంటే చాలా ఎక్కువగా హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పరిశోధకులు గత నెలలో వెలువరించిన వివరాల ప్రకారం... ఈ ఏడాది వచ్చిన ఈ ‘సూపర్-ఎల్ నినో’ కారణంగా జూన్ నుంచి ఫిబ్రవరి 2027 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4,51,000 మందికి పైగా మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కొన్ని కండీషన్స్ ఎంతో కోల్పోయా : మృనాల్‌ఠాగూర్

మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుని ఇండస్ట్రీలోనే సెన్సేషన్ అయ్యింది. అయితే కెరీర్ తొలినాళ్లల్లో తన తల్లిదండ్రులు పెట్టిన కండిషన్ వల్ల ఎన్నో సినిమా ఆఫర్స్ కోల్పోయానని తెలిపింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా? హీరోయిన్ మృణాల్ ఠాకూర్. సీతారామం సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. 2022లో విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమాతో పాన్ ఇండియా లెవల్లో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో నటించింది. కాలేజీ రోజుల్లోనే మరాఠీ సీరియల్లో నటించింది మృణాల్. ఆ తర్వాత హిందీలో మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఆ తర్వాత హాలో నందన్ సినిమాతో వెండితెరకు పరిచయమైంది. రాహుల్ జాదవ్ దర్శకత్వం వహించిన మరాఠీ భాషా చిత్రంలో ఆమె కథానాయికగా అరంగేట్రం చేసింది. ఈ సినిమా తర్వాత మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఈ క్రమంలోనే కెరీర్ తొలినాళ్లల్లో ఎన్నో ఆఫర్స్ కోల్పోయిందట. గతంలో ఓ ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. తాను ఎన్నో హిట్ మూవీస్ కోల్పోయానని తెలిపింది. కెరీర్ తొలినాళ్లల్లో తాను రొమాంటిక్ సీన్లలో నటించనని తన తల్లిదండ్రులు షరతు పెట్టారని.. దీంతో తాను చాలా హిట్ మూవీస్ కోల్పోయానని తెలిపింది. నటి కావాలనే తన కల చెదిరిపోతుందనే భయంతో ఆమె తన తల్లిదండ్రులతో మాట్లాడి.. రొమాంటిక్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపింది. ప్రస్తుతం మృణాల్ పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హోనా హై, సర్దార్ సన్ 2, తుమ్ హై తో , డకోయిట్: ఎ లవ్ స్టోరీ వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె 'డగోయిట్: ఎ లవ్ స్టోరీ' చిత్రంలో యాక్షన్ హీరోయిన్‌గా నటిస్తోంది. మొదట్లో ఈ సినిమాలో నటి శ్రుతి హాసన్ నటించాల్సి ఉంది. కానీ కొన్ని సమస్యల కారణంగా ఆమె ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకుంది. అడివి శేష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను నూతన దర్శకుడు షానిల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.

హీరోయిన్ సంధ్య ఇలా మారిపోయిందా..?

వాలెంటైన్స్ డే.. ఈ సందర్భంగా థియేటర్లలో ఒకప్పటి ప్రేమకథలు చిత్రాలు మరోసారి సందడి చేస్తున్నాయి. అలాగే సినీప్రియుల మదిలో నిలిచిన అద్భుతమైన లవ్ స్టోరీ చిత్రాల్లో ప్రేమిస్తే ఒకటి. 2004లో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం. నిజ జీవితం ఆధారంగా తెరకెక్కించిన ఈ ప్రేమకథ అప్పట్లో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా కథ ప్రతి ఒక్కరిని హత్తు కుంది. అలాగే ఈ చిత్రంలోని సాంగ్స్ ఇప్పటికీ ఎక్కడో ఒకచోట వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా ఈ సినిమా లవ్ ఫెయిల్యూర్ కుర్రాళ్లకు ఎక్కువగా కనెక్ట్ అయ్యింది. ఈ చిత్రంలో కోలీవుడ్ హీరో భరత్, సంధ్య హీరోహీరోయిన్లుగా నటించి మెప్పించారు. వీరిద్దరి యాక్టింగ్ ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించింది. ఇక ఈ సినిమాతోనే వెండితెరకు కథానాయికగా పరిచయమయ్యింది సంధ్య. మొదటి సినిమాతోనే తెలుగులో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ తర్వాత సౌత్ ఇండస్ట్రీలో ఆమెకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ప్రేమిస్తే సినిమాతో వచ్చిన స్టార్ డమ్ ఆ తర్వాత కాపాడుకోలేకపోయింది సంధ్య. హీరోయిన్ గానే కాకుండా సహాయ నటిగా కనిపించింది. తెలుగు, తమిళంలో పలు చిత్రాల్లో కీలకపాత్రలు పోషించింది. పవ్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన అన్నవరం సినిమాలో పవన్ చెల్లిగా కనిపించింది. అందం, అభినయంతో వెండితెరపై సందడి చేసిన సంధ్యకు అనుకున్నంతగా అవకాశాలు మాత్రం రాలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఆమె సినిమాలకు దూరమయ్యింది. 2015లో చెన్నైకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అర్జున్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరిద్దరి వివాహం గురువాయూర్ ఆలయంలో జరిగింది. వీరికి ఒక పాప జన్మించింది. ప్రస్తుతం సంధ్య తన ఫ్యామిలీ తో లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. ప్రస్తుతం సంధ్య లేటేస్ట్ ఫోటోస్ నెట్టింట వైరలవుతుండగా.. అందులో సంధ్య లుక్ చూసి ఆశ్యర్యపోతున్నారు నెటిజన్స్.

ఆకట్టుకుంటున్న హరిహరవిరమల్లు పోస్టర్

హరి హర వీరమల్లు నుంచి వాలెంటైన్స్ డే సందర్భంగా ఓ కూల్ పోస్టర్‌ను వదిలారు. పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ ఈ పోస్టర్‌లో ఎంతో చూడముచ్చటగా కనిపిస్తున్నారు. ఈ ఇద్దరికి మంచి రొమాంటిక్ సాంగ్ కూడా ఉన్నట్టుగా కనిపిస్తోంది. కొల్లగొట్టినాదిరో అంటూ సాగే రెండో పాటను ఫిబ్రవరి 24న రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈ రెండో పాటకు సంబంధించిన అప్డేట్ ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. మాట వినాలి అంటూ వదిలిన ఫస్ట్ సింగిల్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు ఆలస్యం అవుతూనే వస్తోంది. మార్చి 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తారని యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మధ్యలో ఈ మూవీని వాయిదా వేస్తారని అన్నారు. రెండు పార్టులుగా సినిమాను విడగొట్టిన సంగతి తెలిసిందే. మొదటి పార్టుని చాలా వరకు క్రిష్ కంప్లీట్ చేశాడు. కానీ ఇప్పుడు ఈ ప్యాచ్ వర్క్‌లు మిగతా పనుల్ని ఏఎం రత్నం కొడుకు జ్యోతి కృష్ణ కంప్లీట్ చేస్తున్నాడు. హరి హర వీరమల్లు రెండో పార్ట్ మొత్తాన్ని కూడా జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తాడు. అసలు ఈ మొదటి పార్ట్ షూటింగ్ ఎప్పుడు ఫినిష్ అవుతుందా? అని అంతా ఎదురుచూస్తున్నారు. చెప్పిన టైంకి సినిమాను డెలివరీ చేస్తారా? అనే అనుమానం అందరిలోనూ ఉంది.

యూత్ ఆడియెన్స్‌కు కిక్కిచ్చేలా బ్యూటీ పోస్టర్

ఆయ్, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం వంటి హిట్ చిత్రాల్లో తనదైన మార్క్ క్రియేట్ చేసుకున్న అంకిత్ కొయ్య ఇందులో హీరోగా నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. 'త్రిబాణదారి బార్బరిక్' అంటూ ఓ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీతో వానరా సెల్యూలాయిడ్ ఆడియెన్స్‌ను మెప్పించేందుకు ఈ చిత్రంతో రెడీ అవుతోంది. వానరా సెల్యూలాయిడ్, మారుతీ టీం ప్రొడక్ట్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'బ్యూటీ' చిత్రానికి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. 'గీతా సుబ్రమణ్యం', 'హలో వరల్డ్', 'భలే ఉన్నాడే' ఫేమ్ వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కె ఆర్ బన్సాల్ నిర్మించారు. నీలఖి హీరోయిన్ గా నటించారు. తాజాగా 'బ్యూటీ' అనే టైటిల్‌ను ప్రకటించడంతోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. మోషన్ పోస్టర్‌లో చూపించిన బీచ్, రోడ్డు, ఇళ్లు..ఆ తరువాత చివర్లో హీరో హీరోయిన్లను రొమాంటిక్‌గా చూపిస్తూ టైటిల్‌ను చూపించిన తీరు అద్భుతంగా ఉంది. యూత్ ఆడియెన్స్‌కు కిక్కిచ్చేలా ఉంది పోస్టర్. నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌గా శ్రీ సాయి కుమార్ దారా పని చేస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.

ప్రేమికుల రోజు సందర్భంగా ఇన్‌స్టాలో ఫొటోలు షేర్ చేసిన ఆ ముగ్గురు హీరోయిన్లు

ఫొటో అందాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నెటిజన్లు

హీరోయిన్, ఒక్కో భామ ఒక్కో స్టైల్లో అందాలను ప్రదర్శిస్తుంటుంది. కొందరు బుల్లి బట్టలు వేసుకుని అందాలను ప్రదర్శిస్తుంటారు.. మరి కొందరు ట్రెడిషనల్ వేర్‌లో మైండ్ బ్లాక్ చేస్తుంటారు. ఒంపు సొంపులు కనిపించేలా మరి కొంత మంది ఎక్స్ పోజింగ్ చేస్తుంటారు. ఇక ఇన్ స్టాలో ప్రస్తుతం భామలు వదిలిన ఫోటోలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. వాలెంటైన్స్ డే స్పెషల్ అన్నట్టుగా ఒక్కొక్కరు ఒక్కోలా కనువిందు చేస్తున్నారు. ప్రభాస్ ఫౌజీతో పాన్ వరల్డ్‌గా ఫేమస్ కాబోతోంది ఇమాన్వీ. ఇప్పటికే ఈ మూవీ సెట్‌లో ఈ భామ సందడి చేసింది. ప్రభాస్ పెట్టిన ఫుడ్‌ను కూడా టేస్ట్ చేసింది. అన్ని రకాల వంటల్ని చూసి ఇమాన్వీ మైండ్ తిరిగిపోయి ఉంటుంది. ఇక ఈ భామ ఇప్పుడు క్యూట్‌గా పోజులు పెట్టి అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఇక వితిక అయితే పదేళ్లు వెనక్కి వెళ్లింది. పడ్డానండి ప్రేమలో సినిమా టైంలోని ఫోటోలను షేర్ చేసింది. వరుణ్ సందేశ్‌తో చేసిన ఈ సినిమాతోనే వీరి ప్రయాణం మొదలైందన్న సంగతి తెలిసిందే. ఇక తమ పరిచయానికి పదేళ్లు అన్నట్టుగా వితిక ఇలా పాత ఫోటోల్ని వదిలింది. ఈ పదేళ్లలో వీరిద్దరూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా స్రవంతి చొక్కారపు.. కుర్రాళ్ల చొక్కాలు చించుకునేట్టుగా చేసింది. తన ఎద అందాలను చూపించీ చూపించుకుండా.. వదిలిన ఫోటోలతో ఇన్ స్టాలో అగ్గి రాజేసినట్టు అయింది. స్రవంతి దెబ్బకు నెటిజన్లు అంతా నోరెళ్లబెట్టేస్తున్నారు. అమ్మో.. అంటూ ఆ అందాల ఆరబోతని చూసి కామెంట్లు పెడుతున్నారు. సోషల్ మీడియాలో బ్యూటీలు ఇలా అందాలను ప్రదర్శిస్తూనే ఫాలోయింగ్‌ను పెంచుకుంటారు. ఇక వాలెంటైన్స్ డే అంటూ కొందరు భామలు మరింతగా కుర్రాళ్లను కవ్విస్తున్నారు. అషూ, ఆండ్రియా వంటి వారు కూడా రకరకాల ఫోటోలను వదులుతూ నెట్టింట్లో నానా హంగామా చేస్తున్నారు. నిరుపమ్ పరిటాల అయితే ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్నాడు.

వాలెంటైన్స్ డే మీకోసం కాదు... కేవలం వాళ్లకోసమే...

వాలెంటెన్స్‌డేకు సరికొత్త అర్థం చెప్పిన ఉపాసన

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఏదోక పోస్ట్ చేస్తుంటారు. అలాగే అప్పుడప్పుడు చరణ్, క్లింకారకు సంబంధించిన ఫోటోస్, మూవీ అప్డేట్స్ పై షేర్ చేస్తూ ఫాలోవర్లను ఆక్టట్టుకుంటారు. తాజాగా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మెగా కోడలు ఉపాసన ఆసక్తికర పోస్ట్ చేసింది. వాలెంటైన్స్ డేకు సరికొత్త అర్థం చెబుతూ ఉపాసన షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతుంది. ఫిబ్రవరి 14న కేవలం కొందరి కోసమే అంటూ ఫన్నీగా పోస్ట్ చేసింది. ఇది చూసిన నెటిజన్స్ ఫన్నీగా రియాక్ట్ అవుతున్నారు. ఇంతకీ ఉపాసన ఏం పోస్ట్ చేసిందో తెలుసా.. ? ప్రస్తుతం ఉపాసన కొణిదెల చేసిన పోస్ట్ నవ్వులు పూయిస్తుంది. "వాలెంటైన్స్ డే అనేది 22 ఏళ్లు. అంతకంటే తక్కువ వయసు ఉన్న అమ్మాయిలకు సంబంధించినది. మీరు అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారు అయితే.. ఆంటీ దయచేసి ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే కోసం ఎదురుచూడండి" అంటూ పోస్ట్ చేశారు ఉపాసన. ఆమె పోస్టుకు స్మైలీ ఎమోజీలను సైతం జత చేయడంతో నెట్టింట వైరలవుతుంది. ఉపాసన పోస్ట్ పై నెటిజన్స్ క్రేజీగా రియాక్ట్ అవుతున్నారు. ఇక చరణ్ సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే సంక్రాంతి కానుకగా గేమ్ ఛేంజర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చాడు. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ పొలిటికల్ యాక్షన్ చిత్రంలో కియారా అద్వానీ, అంజలి, ప్రకాష్ రాజ్, శ్రీకాంత్ కీలకపాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా మిక్స్డ్ టాక్ అందుకుంది. ప్రస్తుతం చరణ్ డైరెక్టర్ బుచ్చిబాబు సరన దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056